సంపుటి : 9
సంచిక : 295
శనివారం
18 జూలై 2026
పేజీలు : 12
వెల : 2/-
E-PAPER

# విశ్వవాయిస్

10 YEARS CELEBRATING


తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE



Contact For Ads:
7579339999



# కల్లోల కరోనా.. మళ్లీ కలవరం!



## రాష్ట్రంలో 12 మందికి కొవిడ్.. 16 వరకు చెదురుమదురుగా బాధితుల గుర్తింపు

- కడపలో ఎనిమది.. గుంటూరులో రెండు.. విశాఖ, కాకినాడల్లో ఒక్కొక్కరు
- మృతులందరికీ తీవ్రమైన దీర్ఘకాలిక అనారోగ్యాలు
- భయం వద్దు.. అప్రమత్తత తప్పనిసరి : వైద్య ఆరోగ్య శాఖ

**సంఖ్యల్లో తాజా పరిస్థితి**

| | |
|---|---|
| మొత్తం నిర్ధారణలు | 12 |
| వైఎస్సార్ కడప | 8 |
| గుంటూరు | 2 |
| విశాఖపట్నం | 1 |
| కాకినాడ | 1 |
| మరణించినవారు | 4 |
| కోలుకున్నవారు | 3 |
| ఇంటివద్ద చికిత్స | 3 |
| వైద్యశాలలో చికిత్స | 2 |
| జన్యుక్రమ పరీక్షకు నమూనాలు | 5 |

**అమరావతి, విశ్వం వాయిస్ ప్రతినిధి :** ఆరేళ్ల కిందట ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కరోనా మహమ్మారి మరోసారి ఆంధ్రప్రదేశ్‌లో స్వల్ప కలవరాన్ని రేపుతోంది. జూన్ 26 నుంచి జులై 16 వరకు రాష్ట్రంలో 12 మందికి కొవిడ్ నిర్ధారణ కాగా, వారిలో నలుగురు చికిత్స పొందుతూ మరణించారు. అయితే బాధితులందరూ ఒకేచోట లేదా ఒకే ప్రాంతంలో గుర్తించబడలేదని, వేర్వేరు జిల్లాలు, మండలాల్లో చెదురుమదురుగా వ్యాధి బయటపడిందని వైద్య ఆరోగ్యశాఖ స్పష్టం చేసింది. రాష్ట్రంలో ఎక్కడా సామూహిక వ్యాప్తి ఆనవాళు కనిపించలేదని తెలిపింది. ప్రస్తుత పరిస్థితిని గత మహమ్మారి తరంగాలతో పోల్చి ప్రజలు భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని అధికారులు పేర్కొన్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు మాత్రం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లో ఈ ఏడాది తొలి కొవిడ్ నిర్ధారణ జూన్ 26న వైఎస్సార్ కడప జిల్లాలో నమోదైంది. జులై ఒకటో తేదీ నుంచి 16వ తేదీ వరకు మరో 11 మందికి వ్యాధి నిర్ధారణ అయింది. జిల్లాల వారీగా పరిశీలిస్తే వైఎస్సార్ కడప జిల్లాలో అత్యధికంగా ఎనిమిది మంది వ్యాధి బారినపడ్డారు. గుంటూరు జిల్లాలో ఇద్దరికి, విశాఖపట్నం, కాకినాడ జిల్లాల్లో ఒక్కొక్కరికి కొవిడ్ నిర్ధారణ అయింది. బాధితుల్లో ఇద్దరు అంతకుముందు వ్యాధి సోకినవారితో సన్నిహితంగా మెలిగినట్లు అధికారులు గుర్తించారు. మిగిలిన బాధితుల మధ్య ప్రత్యక్ష సంబంధం కనిపించలేదని, ఒక్కో కేసు ఒక్కో ప్రాంతంలో నమోదైందని ఆరోగ్యశాఖ కార్యదర్శి, కుటుంబ సంక్షేమ కమిషనర్ జి. వీరపాండియన్ వెల్లడించారు.

### నలుగురు మృతి.. ఇతర వ్యాధుల ప్రభావం

కొవిడ్ నిర్ధారణ అయిన వారిలో నలుగురు చికిత్స పొందుతూ మరణించారు. మృతుల్లో ముగ్గురు వైఎస్సార్ కడప జిల్లాకు చెందినవారు కాగా, మరొకరు కాకినాడ జిల్లాకు చెందినవారు. మరణించిన నలుగురూ మిగతా .. 2లో..



**జాగ్రత్తలే రక్షణ..**

- ముఖావరణ ధరించండి
- చేతులు తరచుగా శుభ్రం చేసుకోండి
- దూరం పాటించండి
- దగ్గేటప్పుడు, తుమ్మేటప్పుడు నోరు, ముక్కును కప్పుకోండి
- లక్షణాలు ఉంటే వెంటనే వైద్య పరీక్ష చేయించుకోండి




"ప్రజలు అనవసర భయాందోళనలకు గురికాకండి. ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారు. సాధారణ జాగ్రత్తలు పాటిద్దాం.
– జి. వీరపాండియన్, వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి

కోవిడ్ కేసులపై ఆందోళన

# అవసరం లేదు

## మంత్రి సత్యకుమార్



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కొవిడ్‌పై నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ఏపీ వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. కేసుల పట్ల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎన్టీఆర్ జిల్లా రాయనపాడులో మీడియాతో ఆయన మాట్లాడారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లోనూ కొవిడ్ కేసులు వస్తున్నాయన్నారు. కేరళలో 115, కర్ణాటకలో 64, మిగతా .. 2లో..

లోకేశ్ ఆత్మీయతకు

# ధన్యవాదాలు

## మాజీ ఎంపీ గల్లా జయదేవ్




**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** అమరరాజ ప్రస్థానం ఆంధ్రప్రదేశ్‌లోనే ప్రారంభమైనందున ఈ ప్రాంతం ఎప్పటికీ తమకు ఎంతో ప్రత్యేకమైనదని అమరరాజ గ్రూప్ సీఎండీ, మాజీ ఎంపీ గల్లా జయదేవ్ అన్నారు. ఇక్కడ తమ మూలాలు చాలా బలమైనవన్నారు. అమరరాజ తెలంగాణలో విస్తరణపై ఏపీ మంత్రి నారా లోకేశ్ పోస్ట్‌పై గల్లా జయదేవ్ మిగతా .. 2లో..

ప్రజల జీవన ప్రమాణాలు పెరిగితేనే

# నిజమైన అభివృద్ధి

## రుణమేళా కార్యక్రమంలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌తో కలిసి సీఎం చంద్రబాబు



**నరసరావుపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజల వద్దకే బ్యాంకులు వెళ్లి రుణాలు అందించడం గర్వకారణమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలోని కోడెల శివప్రసాదరావు స్టేడియంలో ఏర్పాటుచేసిన రుణమేళా కార్యక్రమంలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌తో కలిసి సీఎం పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు, విద్యార్థులు.. ఇలా అర్హులైన అందరికీ రుణం అందించడమే లక్ష్యమన్నారు. "పల్నాడు గడ్డపై పవిత్రమైన కార్యక్రమానికి ఇవాళ శ్రీకారం చుట్టాం. నిన్నటి వరకు పల్నాడు రోషానికి.. పౌరుషానికి నిదర్శనం. పల్నాడు ప్రజలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు నేడు శ్రీకారం చుట్టాం. సంక్షేమ కార్యక్రమాలతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు పెరిగితేనే నిజమైన అభివృద్ధి. ఒకప్పుడు బ్యాంకు లోన్ కష్టమైన పని.. ఇప్పుడు బ్యాంకులే ప్రజల వద్దకు వెళ్లి రుణాలిస్తున్నాయి. రైతులు, మహిళా సంఘాలు, వ్యాపారులకు రుణాలు ఇచ్చాం. ఇవాళ ఒక్క రోజే 1.04లక్షల మందికి బ్యాంకు రుణాలు అందించడం చరిత్ర. గతంలో మైక్రో ఫైనాన్స్, ప్రైవేట్ కంపెనీల అప్పులతో జనం చాలా ఇబ్బందులు పడ్డారు. బ్యాంకులు విలీనం చేసి సమర్థమైన బ్యాంకింగ్ వ్యవస్థ తెచ్చారు. డిజిటైజేషన్, బ్యాంక్ లింకేజ్ వంటి కార్యక్రమాలు అమలు చేశారు. బ్యాంకింగ్ వ్యవస్థలో నిర్మలా సీతారామన్ విప్లవాత్మక మార్పులు తెచ్చారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా ఎన్నో సంస్కరణలు మిగతా .. 2లో..

కాలినడకన తిరుమలకు

# పవన్ సతీమణి అన్నా లెజినోవా



**తిరుమల, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సతీమణి అన్నా లెజినోవా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అలిపిరి నడక మార్గంలో తిరుమల చేరుకున్న ఆమెకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి దర్శన ఏర్పాట్లు చేశారు.

జనసేన బలాబలాలను బట్టి

# పోటీ చేస్తాం : మంత్రి నాదెండ్ల



**తెనాలి, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పోటీపై మంత్రి నాదెండ్ల మనోహర్ కీలక వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం తెనాలిలో ఆయన మీడియాతో మాట్లాడారు. 2024లో పొత్తు రాష్ట్ర ప్రయోజనాల కోసం పవన్ కల్యాణ్ తీసుకున్న నిర్ణయమని, అప్పటి పరిస్థితిని బట్టి ఒక అడుగు వెనక్కు తగ్గామని అధినేత చెప్పారన్నారు. అప్పుడు వర్తించిన ఫార్ములా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ఉంటుందని వచ్చిన వార్తలు సరి కాదని మనోహర్ స్పష్టం చేశారు. ఎన్డీయే కూటమి సమావేశంలో పొత్తులపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. స్థానిక పరిస్థితులు, పార్టీ బలాబలాలను బట్టి ఎవరికి ఎన్ని అనేది నిర్ణయం ఉంటుందని వివరించారు. కూటమి బలోపేతమే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. జనసేనలో కష్టపడి పనిచేసే వారికి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పిస్తామన్నారు.

ధరణి లావాదేవీలపై

# విచారణకు 'సిట్'..

## తెలంగాణ క్యాబినెట్ నిర్ణయం



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన తెలంగాణ మంత్రివర్గ సమావేశం ముగిసింది. క్యాబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. గత ప్రభుత్వ మిగతా .. 2లో..


వైసీపీ ప్రభుత్వం చేసిందే

# ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేస్తోంది

## ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల



**విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వంపై ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు గుప్పించారు. "తల్లికి వందనానికి పంగనామం–బిడ్డలకు ఎగనామం" ఇదే కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ హామీ అంటూ ఆమె మిగతా .. 2లో..




లైవ్ లొకేషన్ పంపి మరీ... ప్రియుడితో కలిసి

# భర్తను హత్య చేసింది

**చిత్తూరు జిల్లాలో ఆలయానికి వెళ్తుండగా ఘటన**
**సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా కేసును ఛేదించిన పోలీసులు**
**భార్య, ప్రియుడిని అరెస్టు చేసిన పోలీసులు**



**చిత్తూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రియుడి వ్యామోహంలో పడి కట్టుకున్న భర్తనే కిరాతకంగా అంతమొందించింది ఓ భార్య. గుడికి వెళ్దామని నమ్మించి, లైవ్ లొకేషన్ ద్వారా భర్త కదలికలను ఎప్పటికప్పుడు ప్రియుడికి చేరవేసి ఈ ఘాతుకానికి ఒడిగట్టింది. చిత్తూరు జిల్లాలో చోటుచేసుకున్న ఈ దారుణ ఘటనకు సంబంధించి 19 ఏళ్ల హాసిని, ఆమె ప్రియుడు మిగతా .. 2లో..

రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా

# ఖరీఫ్‌లో సాగునీటిని పంపిణీ చేయాలి

## జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సాగునీటిని సక్రమంగా పంపిణీ చేయాలని, హెడ్ స్లూయిస్‌లు, లాకులు, కాలువలను నిరంతరం పర్యవేక్షిస్తూ ఆయకట్టు చివరి భూముల వరకు నీరు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. నీటి వృథాను నివారిస్తూ ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## కల్లోల కరోనా.. మళ్లీ కలవరం!

అంతకుముందే మూత్రపిండాల సమస్యలు, గుండె సంబంధిత వ్యాధులు, అధిక రక్తపోటు, మధుమేహం తదితర తీవ్రమైన దీర్ఘకాలిక అనారోగ్యాలతో బాధపడుతున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ తెలిపింది. అందువల్ల మరణాలకు కొవిడ్ ఒక్కటే కారణమని నిర్ధారించకుండా, బాధితులకు అప్పటికే ఉన్న తీవ్రమైన ఆరోగ్య సమస్యలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని వైద్యవర్గాలు పేర్కొంటున్నాయి. 26 నుంచి జులై 15 వరకు రాష్ట్రంలో లక్షణాలు కనిపించిన 67 మందికి కొవిడ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. వారిలో 11 మందికి వ్యాధి ఉన్నట్లు తేలింది. కాకినాడ జిల్లాకు చెందిన మరొకరికి తమిళనాడులోని వేలూరు వైద్యశాలలో పరీక్ష నిర్వహించగా కొవిడ్ నిర్ధారణ అయింది. దీంతో రాష్ట్రంలో మొత్తం బాధితుల సంఖ్య 12కు చేరింది. బాధితుల్లో ముగ్గురు పూర్తిగా కోలుకుని వైద్యశాల నుంచి ఇంటికి చేరారు. మరో ముగ్గురు ఇంటివద్ద ప్రత్యేకంగా ఉంటూ వైద్యుల సూచనల మేరకు చికిత్స పొందుతున్నారు. ఇద్దరు వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారు. మిగిలిన నలుగురు మరణించారు.

**పుణేకు ఐదు నమూనాలు**

ప్రస్తుతం వ్యాపిస్తున్న కరోనా విషాణువులో ఏవైనా కొత్త మార్పులు చోటుచేసుకున్నాయా అనే విషయాన్ని తెలుసుకునేందుకు ఐదు నమూనాలను పుణేలోని జాతీయ విషాణు విజ్ఞాన సంస్థకు పంపించారు. జులై 9న పంపిన ఈ నమూనాల జన్యుక్రమాన్ని పరిశీలించిన అనంతరం ప్రస్తుతం వ్యాపిస్తున్న విషాణువు రూపం ఏమిటనేది స్పష్టమవుతుందని అధికారులు తెలిపారు. ఫలితాలు వచ్చే వరకు కొత్త రూపం వ్యాపిస్తోందంటూ సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మవద్దని సూచించారు.

జులై ఒకటో తేదీ నుంచి దేశవ్యాప్తంగా 339 మందికి కొవిడ్ నిర్ధారణ అయినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ వెల్లడించింది. కేరళలో అత్యధికంగా 115 మంది వ్యాధి బారినపడగా, కర్ణాటకలో 64, మహారాష్ట్రలో 43, తమిళనాడులో 39 మందికి కొవిడ్ నిర్ధారణ అయింది. అండమాన్-నికోబార్ దీవులు, దిల్లీలో 18 మంది చొప్పున, రాజస్థాన్‌లో 12 మంది వ్యాధి బారినపడ్డారు. మరికొన్ని రాష్ట్రాల్లో స్వల్ప సంఖ్యలో బాధితులు గుర్తించబడ్డారు. పుట్టింది? కొవిడ్ మహమ్మారికి కారణమైన కొత్త కరోనా విషాణువును 2019 చివరిలో చైనాలోని హుబే ప్రాంతం వుహాన్ నగరంలో తొలిసారిగా గుర్తించారు. ప్రారంభంలో బయటపడిన అనేక మంది బాధితులకు వుహాన్‌లోని సముద్ర ఆహార, జంతు విక్రయ ప్రాంగణంతో సంబంధం ఉన్నట్లు గుర్తించారు. అయితే విషాణువు కచ్చితంగా ఎక్కడ, ఎలా పుట్టిందనే అంశంపై ఇప్పటికీ తుది నిర్ధారణ కాలేదు. ఇప్పటివరకు అందుబాటులో ఉన్న ఆధారాలు గబ్బిలాలు లేదా మరో మధ్యవర్తి జంతువు నుంచి మనుషులకు వ్యాపించి ఉండే అవకాశాన్ని ఎక్కువగా సూచిస్తున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిపుణుల బృందం పేర్కొంది. వుహాన్‌లోని పరిశోధనశాల నుంచి ప్రమాదవశాత్తూ విషాణువు బయటపడిందనే వాదన కూడా పరిశీలనలో ఉంది. అయితే దానిని నిర్ధారించడానికి లేదా పూర్తిగా తోసిపుచ్చడానికి అవసరమైన సమాచారం అందుబాటులో లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. విషాణువు మూలాలపై పరిశోధన ఇంకా పూర్తికాలేదని స్పష్టం చేసింది. 20 నుంచి ప్రపంచం అనేక కరోనా తరంగాలను ఎదుర్కొంది. భారతదేశంలో కోట్లాది మంది వ్యాధి బారినపడగా, లక్షలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ముఖ్యంగా రెండో తరంగంలో ప్రాణవాయువు కొరత, వైద్యశాలల్లో పడకలు దొరక్కపోవడం, మందుల కొరత వంటి పరిస్థితులు ప్రజలను తీవ్రంగా కలచివేశాయి. కుటుంబాలకు కుటుంబాలే విషాదంలో మునిగిపోయాయి. దేశ ఆరోగ్య వ్యవస్థపై ఎన్నడూ లేనంత ఒత్తిడి ఏర్పడింది.

ప్రస్తుతం నమోదవుతున్న బాధితుల సంఖ్య, వ్యాధి తీవ్రత, వైద్య సదుపాయాలు నాటి పరిస్థితులతో పోలిస్తే పూర్తిగా భిన్నంగా ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

**గతానికి.. ఇప్పటికి తేడా ఇదే**

**గతంలో:** ప్రజల్లో కరోనా విషాణువుపై సహజ రోగనిరోధక శక్తి చాలా తక్కువగా ఉండేది. రక్షణ టీకాలు అందుబాటులో లేవు.

**ప్రస్తుతం:** అధికశాతం మందికి టీకాల ద్వారా లేదా గతంలో వ్యాధి సోకడం ద్వారా కొంత రోగనిరోధక శక్తి ఏర్పడింది.

**గతంలో:** ఊపిరితిత్తులు తీవ్రంగా దెబ్బతినడం, శరీరంలో ప్రాణవాయువు స్థాయి పడిపోవడం వంటి సమస్యలు అధికంగా కనిపించేవి.

**ప్రస్తుతం:** అనేక మందిలో జ్వరం, దగ్గు, జలుబు, గొంతు నొప్పి వంటి తేలికపాటి లక్షణాలే కనిపిస్తున్నాయి. అయినప్పటికీ వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారికి ప్రమాదం పూర్తిగా తొలగిపోలేదు.

**గతంలో:** వైద్యశాలలు రోగులతో నిండిపోవడంతో చికిత్స అందించడం కష్టమైంది.

**ప్రస్తుతం:** బాధితుల సంఖ్య స్వల్పంగా ఉండటంతో వైద్య వ్యవస్థపై ఎటువంటి అసాధారణ ఒత్తిడి లేదని అధికారులు చెబుతున్నారు.

**భయం వద్దు.. జాగ్రత్త తప్పనిసరి**

జ్వరం, దగ్గు, గొంతు నొప్పి, శరీర నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే ఇతరులతో సన్నిహితంగా మెలగకుండా వైద్యుల సలహా తీసుకోవాలి. లక్షణాలున్నవారు రద్దీ ప్రదేశాలకు వెళ్లాల్సి వస్తే ముఖావరణం ధరించడం మంచిది. వృద్ధులు, గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, మధుమేహం తదితర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు గాలి సరిగా రాని రద్దీ ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తపడాలి. చేతులను తరచుగా శుభ్రం చేసుకోవడం, దగ్గేటప్పుడు లేదా తుమ్మేటప్పుడు నోరు, ముక్కును కప్పుకోవడం వంటి సాధారణ జాగ్రత్తలు పాటించాలి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతీలో నొప్పి, తగ్గని తీవ్రమైన జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా సమీప వైద్యశాలను సంప్రదించాలి.

**వైద్య ఆరోగ్యశాఖ స్పష్టీకరణ**

ప్రస్తుతం రాష్ట్రంలో నమోదవుతున్నవి చెదురుమదురు నిర్ధారణలేనని, ఒకే ప్రాంతంలో సామూహిక వ్యాప్తి కనిపించలేదని వైద్య ఆరోగ్యశాఖ స్పష్టం చేసింది. ప్రజలు అనవసర భయాందోళనలకు గురికాకుండా, వదంతులను నమ్మకుండా సాధారణ ముందుజాగ్రత్తలు పాటించాలని సూచించింది. రాష్ట్రంలోని వైద్యులు, వైద్యశాలలు, ఆరోగ్య సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు వెల్లడించింది.

## నిజమైన అభివృద్ధి

అమలు చేస్తున్నారు. మరో 6 జిల్లాల్లో ఇదేతరహాలో కార్యక్రమాలు ఏర్పాటు చేస్తాం" అని సీఎం అన్నారు.

**ప్రతి గ్రామానికీ బ్యాంకు సేవలు ప్రధాని మోదీ లక్ష్యం: నిర్మలా సీతారామన్**

బ్యాంకింగ్ వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చామని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ప్రతి గ్రామానికీ బ్యాంకు సేవలు వెళ్లాలనేదే ప్రధాని మోదీ లక్ష్యమని చెప్పారు. "బ్యాంకులు తమ వైఖరిని మార్చుకున్నాయి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నా. మీ వ్యాపారాలు ముందుకు తీసుకెళ్లేందుకు ఇది అవకాశం. ప్రధాని చెబుతున్న వికసిత్ భారత్ లక్ష్యాల సాధనకు మీ సహకారం కావాలి. దేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు మీరు సహకరించాలి. గతంలో చిరు వ్యాపారులు వడ్డీ వ్యాపారులతో ఇబ్బంది పడేవారు. తొలుత బండ్ల వారికి గ్యారంటీ లేకుండా బ్యాంకు రుణాలు వచ్చేలా చర్యలు తీసుకున్నాం. ప్రభుత్వమే గ్యారంటీ ఇచ్చి రుణాలు అందించాం. బ్యాంకు రుణాలు తీసుకోవాలనే ఆలోచన గతంలో చాలా మందికి ఉండేది కాదు. మోదీ సూచనతో బ్యాంకులు ప్రజల వద్దకు వెళ్తున్నాయి. ఇవాళ లక్షల మందికి సులువుగా రుణాలు అందుతున్నాయి. గతంలో కాంగ్రెస్ నేతలు చెప్పిన వారికే బ్యాంకర్లు రుణాలు ఇచ్చేవారు. తీసుకున్నవాళ్లు సరిగా చెల్లించకపోవడంతో ఎన్నో ఇబ్బందులు వచ్చాయి. ఇప్పుడు గ్రామగ్రామానికీ బ్యాంకులు వెళ్తున్నాయి. ప్రజల అవసరాలను తెలుసుకుని రుణాలు ఇస్తున్నారు" అని నిర్మలా సీతారామన్ అన్నారు.

## కోవిడ్ కేసులపై ఆందోళన అవసరం లేదు

తమిళనాడులో 39 కేసులు బయటపడ్డాయని.. రాష్ట్రంలో 13 మాత్రమే నమోదయ్యాయని తెలిపారు. నమూనాలను సేకరించి పుణెలోని ల్యాబ్‌కు పంపించామని చెప్పారు. శానిటైజర్లు, కోవిడ్ సామగ్రి అందుబాటులో ఉంచామని.. ఆస్పత్రుల్లో ఐసోలేషన్ వార్డులు పెట్టామన్నారు. ప్రస్తుతం నమోదవుతున్నవి ప్రమాదకరమైన వేరియంట్ కాదని చెప్పారు.

## లోకేశ్ ఆత్మీయతకు ధన్యవాదాలు

స్పందించారు. ఏపీపై తమకున్న నిబద్ధత ఎన్నటికీ సడలదని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ఈ బంధం మరింత బలపడుతుందని గట్టిగా నమ్ముతున్నామన్నారు. లోకేశ్ ఆత్మీయతకు ధన్యవాదాలు తెలిపారు. కలిసికట్టుగా మరిన్ని నూతన అవకాశాలను సృష్టిస్తూ, మరింత ఉజ్వల భవిష్యత్తును నిర్మించడానికి ముందుకుసాగుదామని జయదేవ్ ఆకాంక్షించారు. 'చిత్తూరులో పుట్టిన అమరరాజ సంస్థ ఆంధ్రప్రదేశ్ పేరును ప్రపంచవ్యాప్తంగా సగర్వంగా చాటిచెప్పింది. అలాంటి సంస్థకు సొంత రాష్ట్రంలో వైకాపా పాలనలో తీవ్రస్థాయిలో వేధింపులు ఎదురయ్యాయి. ప్రోత్సాహం అందించడానికి బదులుగా బెదిరింపులు, ఇబ్బందులకు గురిచేశారు. ఇలా జరగాల్సింది కాదు. అందుకు ఆంధ్రప్రదేశ్ మీకు క్షమాపణ చెప్తాం గల్లా జయదేవ్' అని మంత్రి లోకేశ్ నిన్న ఎక్స్‌లో పోస్టు చేసిన విషయం తెలిసిందే. 'ఏపీలో పుట్టిన ఒక సంస్థ తన విస్తరణ కోసం మరో రాష్ట్రానికి వెళ్లాల్సి రావడం నన్ను కలచివేస్తోంది. మీ కోసం రాష్ట్రం తలుపులు, మా హృదయాలు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. నాలుగు దశాబ్దాల మీ ప్రయాణం విజయగాథ మాత్రమే కాదు.. అంతకంటే ఎక్కువ. ప్రపంచ స్థాయి తయారీ కేంద్రాన్ని సృష్టించి వేలాది మందికి మీరు ఉపాధి కల్పించారు' అని లోకేశ్ పేర్కొన్నారు.

## ధరణి లావాదేవీలపై విచారణకు 'సిట్'

హయాంలో జరిగిన ధరణి లావాదేవీలపై సమగ్ర విచారణ జరపాలని మంత్రివర్గం నిర్ణయించింది. వివిధ శాఖల అధికారులు, నిపుణులతో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. గ్రామ పంచాయతీల సొంత ఆదాయం పంచాయతీ ఖాతాలోనే జమ చేయాలనే నిర్ణయానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. భేటీ ముగిసిన అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియాకు వివరాలు వెల్లడించారు. సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులపై క్యాబినెట్ ఆందోళన వ్యక్తం చేసిందని పొంగులేటి తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో 30 శాతానికి మించి వర్షాలు పడలేదన్నారు. "తాగు, సాగునీరు, విద్యుత్‌కు సమస్యలు రాకుండా చర్యలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈనెల 20న జిల్లాల్లో ఇన్‌ఛార్జ్ మంత్రుల నేతృత్వంలో సమావేశాలు జరుగుతాయి. ఆ నివేదికలు వచ్చిన తర్వాత సీఎం రేవంత్ సమీక్షిస్తారు. కేంద్ర ప్రభుత్వానికీ నివేదిక పంపి మద్దతు కోరతాం. రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేయాలి. దీనిపై రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి నేతృత్వంలో రైతులకు అవగాహన కల్పించాలని నిర్ణయించాం. ధరణిపై సమగ్ర విచారణకు ప్రత్యేక విచారణ బృందం ఏర్పాటు చేయాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. ధరణి పోర్టల్ టెండర్ ప్రక్రియ నుంచి భూభారతి ఏర్పాటు వరకు క్షుణ్ణంగా విచారణ జరుగుతుంది. ధరణితో వచ్చిన ఇబ్బందులపై మంత్రివర్గ సమావేశంలో చర్చించాం. టెండర్ ప్రక్రియ కోసం ప్రత్యేక చట్టం, విధివిధానాల సిఫార్సుకు నిపుణులతో కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్‌ను కో-ఆప్షన్ సభ్యులుగా నియమించేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. చిన్న కాళేశ్వరం ప్రాజెక్టును గత ప్రభుత్వం విస్మరించింది. ఆ ప్రాజెక్టులో మిగిలిన పనులకు డీపీఆర్ తయారు చేయాలని నిర్ణయం తీసుకున్నాం" అని పొంగులేటి వివరించారు.

## ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేస్తోంది

విమర్శించారు. అంతేకాదు గత ముఖ్యమంత్రి జగన్‌కి వారసుడు నేటి సీఎం చంద్రబాబు అంటూ ఆమె ఎద్దేవా చేశారు. గత వైసీపీ మోసాలను తు.చ తప్పకుండా పాటించడం కూటమి ప్రభుత్వ విధానమైందని మండిపడ్డారు. అమ్మఒడి పేరుతో ఒక్క బిడ్డకే ఇచ్చి వైసీపీ ప్రభుత్వం తల్లులను పచ్చిమోసం చేసిందని వ్యాఖ్యానించారు. "నీకు 15, నీకు 15, ఎంతమంది ఉంటే అన్ని 15 వేలు అని చెప్పిన చంద్రబాబు... ఇప్పుడు చంద్రబాబు తల్లులను నయవంచన చేస్తున్నారని షర్మిల ఆరోపించారు. కోతల రాయుడు కోతలంటూ జగన్ ను ఎద్దేవా చేసిన చంద్రబాబే మళ్లీ కోతలకు బ్రాండ్ అంబాసిడర్ అయ్యారని విమర్శించారు. తల్లికి వందనంపై నిజంగా చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే 87 లక్షల మంది బిడ్డలకి ఇవ్వాల్సారు. కోతలు పెట్టకుండా ప్రతి బిడ్డకు 15 వేలు జమ చేయాలన్నారు. కొర్రీలు పెట్టకుండా మిగతా 20 లక్షల మంది బిడ్డలకు పథకాన్ని అందజేయాలని డిమాండ్ చేశారు. గత వైసీపీ పాలనలో అమ్మఒడి పథకం కింద ఒక్కబిడ్డకే ఇచ్చి తల్లులను మోసం చేశారని... ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా అదే మార్గం అనుసరిస్తోందని షర్మిల ఆరోపించారు. తల్లికి వందనం పథకం కేవలం ఎన్నికల ముందు ఇచ్చిన హామీగా మిగిలిపోయిందని విమర్శించారు.

## భర్తను హత్య చేసింది


యుగంధర్‌తో పాటు మరో ఇద్దరు నిందితులను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం, తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి జిల్లా సూళగిరికి చెందిన రమేష్ (23)కు, హాసినికి రెండేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమార్తె ఉంది. అయితే, వివాహానికి ముందు నుంచే హాసిని తన చిన్ననాటి స్నేహితుడు యుగంధర్ (20)తో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ఈ క్రమంలో, అమావాస్యను పురస్కరించుకుని గుడుపల్లె మండలం మల్లప్ప కొండపై వెలిసిన శ్రీ మల్లేశ్వర స్వామి ఆలయ దర్శనానికి వెళదామని హాసిని తన భర్తను నమ్మించింది. భర్త, కుమార్తెతో కలిసి బైక్‌పై వెళుతూనే, హాసిని తన లైవ్ లొకేషన్‌ను ప్రియుడు యుగంధర్‌కు షేర్ చేసింది. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం, కొండపైకి వెళ్లే మార్గంలోని మూడో హెయిర్‌పిన్ బెండ్ వద్దకు చేరుకోగానే, తన హ్యాండ్‌బ్యాగ్ కింద పడిపోయిందని చెప్పి భర్తతో బండిని ఆపించింది. వెంటనే అక్కడికి చేరుకున్న యుగంధర్, అతని స్నేహితులు రమేష్‌ను సమీపంలోని అటవీ ప్రాంతంలోకి లాక్కెళ్లి వేటకొడవళ్లతో అత్యంత దారుణంగా నరికి చంపారు. ఈ ఘోరం జరుగుతున్న సమయంలో వారి చిన్నారి కుమార్తె అక్కడే ఉండటం గమనార్హం. రమేష్, హాసినిలు ఎంతకీ ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన హాసిని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆలయ మార్గంలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా కీలక ఆధారాలు లభించాయి. రమేష్‌తో కలిసి వెళ్లిన హాసిని, తిరుగు ప్రయాణంలో మాత్రం వేరే వ్యక్తులతో కలిసి బైక్‌పై వెళ్లడాన్ని పోలీసులు గుర్తించారు. నిందితుల మొబైల్ రికార్డులు, లొకేషన్ డేటా ఆధారంగా గాలించిగా రమేష్ మృతదేహం లభ్యమైంది. అనంతరం నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు, హాసిని ఫోన్ పరిశీలించి ప్రియుడికి లైవ్ లొకేషన్ పంపిన ఆధారాలను సేకరించారు.

## ఖరీఫ్‌లో సాగునీటిని పంపిణీ చేయాలి

జిల్లా కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి జలవనరుల శాఖ సమీక్ష సమావేశంలో మంత్రి, జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ సెంట్రల్ డెల్టా వాటర్ మేనేజ్‌మెంట్ పర్యవేక్షణలో కోనసీమ జిల్లాలోని కొత్తపేట, పి.గన్నవరం, అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల పరిధిలో లొల్లి, పలివెల, ముక్కామల, నడిపూడి, సమనస, అన్నంపల్లి ప్రాంతాల్లోని లాకులు, హెడ్ స్లూయిస్‌లు, కాలువలను పరిశీలించినట్లు తెలిపారు. గోదావరి డెల్టా ప్రాంతం రాష్ట్ర వ్యవసాయానికి వెన్నెముకలాంటిదని, సూపర్ ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు ఉన్నప్పటికీ రైతులకు సాగునీటి కొరత రాకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. గతంలో మార్చి, ఏప్రిల్ నెలల్లో మాత్రమే సాగునీటి విడుదల జరిగేదని, అయితే ఈసారి తొలిసారిగా సీలేరు నుంచి 15 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. 70 ఏళ్ల చరిత్రలో గోదావరిలో ఈ స్థాయిలో వర్షపాతం లోటు నమోదవడం ఆందోళనకరమన్నారు. అయినప్పటికీ తాగునీరు, సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర నీటి నిర్వహణ చేపడుతున్నామని చెప్పారు. గోదావరిలోకి వచ్చే నీటి ప్రవాహం, కాలువల ద్వారా విడుదలయ్యే నీటి పరిమాణంపై ఇరిగేషన్ అధికారులు, నీటి సంఘాల ప్రతినిధులు, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కాలువల వద్ద లాకుల షట్టర్ల పనితీరు, గ్రీజింగ్, రీడింగ్స్, మరమ్మతులపై అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ధవలేశ్వరం బ్యారేజ్ నుంచి చివరి ఆయకట్టు వరకు కాలువల నీటి ప్రవాహాన్ని నిరంతరం పరిశీలిస్తూ అవసరమైన చోట లాకులను తనిఖీ చేసి అధికారులకు తగిన సూచనలు చేస్తున్నామని చెప్పారు. లోటు వర్షపాతం కారణంగా గోదావరి ప్రవాహం తగ్గినప్పటికీ సమగ్ర నీటి నిర్వహణతో 14,700 క్యూసెక్కుల నీటిని అందిస్తున్నామని, అయినప్పటికీ దిగువ ప్రాంతాల్లో నీటి ఎద్దడి ఎదురవుతోందన్నారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో నియంత్రణ చేపట్టి దిగువ ప్రాంతాలకు సమానంగా నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రూ.74.24 కోట్ల వ్యయంతో చేపడుతున్న లొల్లి లాకుల పనుల పురోగతిని సమీక్షించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్ మాట్లాడుతూ రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వెంటనే పరిష్కరించేలా అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని సూచించారు. సాగునీటి నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, రాజోలు ఎమ్మెల్యే దేవర వరప్రసాద్, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, ప్రాజెక్టు చైర్మన్ బొబ్బల శ్రీనివాస్, ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ అధికారులు, నీటి సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**ముక్కామల లాకుల వద్ద ఇరిగేషన్ మంత్రికి**

## ఘన స్వాగతం పలికిన యువనేత అయితాబత్తుల కరణ్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం నియోజకవర్గ పరిధిలోని పంట కాలువల క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చిన రాష్ట్ర ఇరిగేషన్, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడికి ముక్కామల లాకుల వద్ద ఘన స్వాగతం లభించింది. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు తనయుడు, యువనేత అయితాబత్తుల కరణ్ ఆధ్వర్యంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, కూటమి నాయకులు, కార్యకర్తలు మంత్రికి శాలువా కప్పి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా యువనేత అయితాబత్తుల కరణ్ ముక్కామల లాకుల వద్ద కాలువల పరిస్థితిని, రైతులు సాగునీటి సరఫరాలో ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. డెల్టా ఆధునికీకరణ పనుల్లో భాగంగా నియోజకవర్గంలోని పంట కాలువల పూడికతీత పనులను వేగవంతం చేయాలని, చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి నిమ్మల రామానాయుడు సానుకూలంగా స్పందిస్తూ, కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని, నియోజకవర్గంలోని సాగునీటి సమస్యలను ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కొత్తపేటలో నేడు విద్యుత్ నిలిపివేత

**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేట కొత్తపేట 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ సమితి రోడ్, 11 కేవీ బోడిపాలెం, 11 కేవీ కోర్టు ఫీడర్లలో చెట్ల కొమ్మల తొలగింపు, నిర్వహణ మరియు మరమ్మత్తు పనులు చేపట్టనున్న నేపథ్యంలో జూలై 18 (శనివారం) ఉదయం 8:00 గంటల నుంచి మధ్యాహ్నం 2:00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.విద్యుత్ సరఫరా నిలిచిపోయే ప్రాంతాలు నారాయణలంక, బండారుపేట,వాడపాలెం (పూర్తిగా), చిన్నమెరక, పెద్దమెరక, పనసలదొడ్డి, కమ్మిరెడ్డిపాలెం, మారుతీ సెంటర్, చిన్నగూళ్ళపాలెం, పెద్దగూళ్ళ పాలెం, బోడిపాలెం, బొరుసువారిసావరం, పలివెల బ్రిడ్జి డౌన్, సమితి ఆఫీస్ రోడ్, పోలీస్ స్టేషన్ రోడ్, గణేష్ కాలనీ, భవానీ కాలనీ, కౌశిక్ రోడ్, సంతోష్ నగర్, కాపు కళ్యాణమండపం పరిసర ప్రాంతాలు.విద్యుత్ వినియోగదారులు ముందస్తుగా అవసరమైన ఏర్పాట్లు చేసుకుని, విద్యుత్ శాఖ సిబ్బంది చేపట్టే నిర్వహణ పనులకు సహకరించాలని కొత్తపేట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. రాంబాబు విజ్ఞప్తి చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత

**గ్రీవెన్స్ సెల్‌లో 38 అర్జీలు స్వీకరించిన మంత్రి వాసంశెట్టి సుభాష్**



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగం (గ్రీవెన్స్ సెల్) కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా మొత్తం 38 అర్జీలు అందాయి. అర్జీదారుల నుంచి నేరుగా వినతిపత్రాలను స్వీకరించిన మంత్రి సుభాష్, ప్రతి సమస్యను పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రధానంగా ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యలకు తొలి ప్రాధాన్యత ఇస్తూ వారి జీవితాల్లో ఆనందం నింపేందుకు కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా కృషి చేస్తోందన్నారు. గ్రీవెన్స్ సెల్‌కు వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు మంత్రి ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీపై ప్రత్యేక దృష్టి సారించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన అర్జీదారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**ద్రాక్షారామ భీమేశ్వర స్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకున్న**

## కాయిర్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ సమీర్ కిషన్



**ద్రాక్షారామ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాయిర్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ సమీర్ కిషన్ ఐఏఎస్ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ద్రాక్షారామ శ్రీ భీమేశ్వర స్వామి వారిని, అష్టాదశ శక్తిపీఠాలలో ఒకటైన శ్రీ మాణిక్యాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన సమీర్ కిషన్‌కు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవార్ల సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. దర్శనం అనంతరం ముఖమండపంలో వేద పండితులు మంత్రోచ్ఛారణలతో వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి శేషవస్త్రాన్ని బహూకరించి, లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ, అర్చకులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.


## షైనింగ్ స్టార్ అవార్డులకు సూర్య హైస్కూల్ విద్యార్థినులు ఎంపిక




**ద్రాక్షారామ, విశ్వం వాయిస్ న్యూస్ :** ద్రాక్షారామ పరిధిలోని సూర్య హైస్కూల్ పదో తరగతి విద్యార్థినులు సంగడాల లక్ష్మీ ప్రహర్ష, జంగం కావ్య శ్రీ తేజస్విని 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందజేస్తున్న షైనింగ్ స్టార్స్-2026 ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ విషయాన్ని సూర్య విద్యాసంస్థల యాజమాన్యం శుక్రవారం విలేకరులకు తెలిపింది. ఈ నెల 20వ తేదీన అమలాపురంలో జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ చేతుల మీదుగా వీరు ప్రశంసా పత్రంతో పాటు 20 వేల రూపాయల నగదు బహుమతి, ప్రతిష్టాత్మక అవార్డును అందుకోనున్నారు. ఈ సందర్భంగా యాజమాన్యం మాట్లాడుతూ, తమ పాఠశాల విద్యార్థులు షైనింగ్ స్టార్ అవార్డులు సాధించడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. చదువుతో పాటు అన్ని రంగాలలో విద్యార్థులను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని, విద్యార్థుల ప్రతిభకు ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల సహకారమే ఈ అవార్డుల రూపంలో నిదర్శనంగా నిలిచాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో వీరు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అవార్డులకు ఎంపికైన విద్యార్థినులను సూర్య స్కూల్ మరియు సూర్య జూనియర్ కాలేజ్ యాజమాన్యం, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందించారు.

**జిల్లా సాగునీటి పరిస్థితులపై సమీక్ష సమావేశంలో**

## పాల్గొన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సాగునీటి సమీక్ష సమావేశంలో ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముమ్మిడివరం నియోజకవర్గానికి సంబంధించిన సాగునీటి సమస్యలను ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యంగా కాలువల నిర్వహణ, నీటి పంపిణీ, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వివరించి, తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి నిమ్మల ముమ్మిడివరం నియోజకవర్గానికి సంబంధించిన అంశాలను సానుకూలంగా పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ, ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఉన్నప్పటికీ జిల్లాలోని ప్రతి ఆయకట్టుకు సాగునీరు అందేలా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నీటి నిర్వహణను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పాటు జిల్లా కలెక్టర్ డాక్టర్ రావిరాల మహేష్ కుమార్ , జిల్లాలోని శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, నీటిపారుదల శాఖ అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులతో కలిసి ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు కూడా పాల్గొన్నారు.



## నేడు విద్యుత్తుకు అంతరాయం

**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం పట్టణంలో గల 11కెవి హై స్కూల్ మరియు బాలయోగి ఘాట్,సూర్యనగర్ ఫీడర్ లు ట్రీ కట్టింగ్ నిమిత్తం 18-7-2026 శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తుకు అంతరాయం ఏర్పడునని అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే రాంబాబు తెలిపారు. అంతరాయం ఏర్పడు ప్రాంతాలు హనుమాన్ థియేటర్ రోడ్,నారాయణపేట,ప్రభాకర్ నగర్,బ్యాంకు రోడ్,పట్టాభి స్ట్రీట్, కార్మిక నగర్, సావరం బైపాస్ రోడ్డు, మిరియం క్యాంపస్, రావులచెరువు, నల్లవంతన కలెక్టర్ ఆఫీస్ రోడ్డు,సూర్యనగర్,దొమ్మేటివారి వీధి,హైస్కూల్ రోడ్ ప్రాంతాలలో పవర్ కట్ ఉటుంది అని తెలియచేసారు.

**అంతర్జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా**

## ప్రముఖ న్యాయవాదులకు ఘన సన్మానం



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం అమలాపురం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో హోటల్ శుభగృహ నందు ప్రముఖ న్యాయవాదులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అడపా సత్య ప్రసాద్‌తో పాటు సీనియర్ న్యాయవాదులు నంబూరి సూర్యనారాయణమూర్తి, మాకిరెడ్డి ఆదినారాయణరావు, దుర్గా బాబిలను శాలువాలు కప్పి పుష్ప గుచ్ఛాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సన్మానితులు మాట్లాడుతూ, న్యాయం సమాజానికి పునాది అని పేర్కొన్నారు. ప్రజల్లో చట్టాలపై అవగాహన పెరగడంతో పాటు ప్రతి ఒక్కరూ రాజ్యాంగ విలువలను గౌరవిస్తూ చట్టాలను పాటించాలని సూచించారు. న్యాయవాదులు కేవలం కోర్టులకే పరిమితం కాకుండా సమాజంలో న్యాయం, ధర్మం, మానవ హక్కుల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు.ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు న్యాయ వ్యవస్థ నిరంతరం కృషి చేస్తోందని, యువత న్యాయ వ్యవస్థపై అవగాహన పెంపొందించుకుని బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సన్మానం తమపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులోనూ న్యాయ సేవలను అంకితభావంతో కొనసాగిస్తామని తెలిపారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు మాట్లాడుతూ, సమాజానికి విశిష్ట సేవలు అందిస్తున్న న్యాయవాదులను సత్కరించడం గర్వకారణమని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు న్యాయ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అమలాపురం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, కార్యదర్శి కొమ్మూరి వెంకటాచల ప్రసాద్, ముఖ్య సలహాదారులు కంచిపల్లి అబ్బులు, నల్లా పవన్, అరిగెల నాని, నమ్మిన వీరబాబు, నంబూరి నరేష్, నంబూరి సత్యనారాయణమూర్తి, వాసిరెడ్డి సుబ్రహ్మణ్యేశ్వరరావు, రేకపల్లి సూరిబాబు, ద్వారంపూడి సత్యనారాయణ రెడ్డి, తిక్కా మురళి తదితరులు పాల్గొన్నారు.

# ఎడిటర్ వాయిస్

## 'స్థానిక' వాటాలు.. లెక్క కుదరడం లేదా? టీడీపీ, జనసేన తలోమాట!

స్థానిక ఎన్నికల్లో పోటీపై కూటమి నేతల ప్రకటనలు తీవ్ర చర్చనీయాంశం అవుతున్నాయి. స్థానిక ఎన్నికలకు సిద్ధమవ్వాలంటూ కేడర్ కు పిలుపునిస్తున్న అగ్ర నేతలు పోటీపై భిన్న ప్రకటనలు చేస్తున్నారు. దీంతో ఎన్నికల్లో పోటీపై టీడీపీ, జనసేన పార్టీల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. వచ్చే సెప్టెంబరులో మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తామని, కేడర్ రెడీగా ఉండాలంటూ మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారు. మూడు పార్టీల కూటమిగా పోటీ చేస్తామని, ప్రతి ఒక్కరూ విజయంపై దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. ఇదే సమయంలో కూటమి పార్టీల సమన్వయంలో స్థానిక ఎన్నికల్లో పోటీపై అవగాహన కుదరిందని, టీడీపీ 80 శాతం సీట్లలోను జనసేన 15 శాతం, బీజేపీ 5 శాతం సీట్లలో పోటీ చేస్తుందని మంత్రి లోకేశ్ చెప్పినట్లు వార్తలు వచ్చాయి. దీనికి భిన్నంగా జనసేనకు చెందిన మంత్రి నాదెండ్ల మనోహర్ స్పందించడం రాజకీయంగా చర్చనీయాంశం అవుతోంది.

స్థానిక ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై మంత్రి లోకేశ్ ప్రతిపాదనలకు భిన్నంగా జనసేనకు చెందిన మంత్రి నాదెండ్ల మనోహర్ చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ అవుతున్నాయి. 'స్థానిక ఎన్నికల్లో జనసేన బలాబలాలు ఆధారంగానే పోటీ చేస్తామని, సార్వత్రిక ఎన్నికల్లో మాదిరిగా నాలుగు సీట్లు తగ్గించుకుని పోటీ చేసే పరిస్థితి ఉండదు' అంటూ మంత్రి మనోహర్ స్పష్టమైన ప్రకటన చేశారు. దీంతో టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి లోకేశ్ ప్రతిపాదించిన సర్దుబాటు లెక్కల ప్రకారం 15 శాతం సీట్లు తీసుకోడానికి జనసేన సిద్ధంగా లేనట్లు జనసేన పార్టీ స్పష్టమైన ప్రకటన చేసిందని అంటున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే స్థానిక ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై తీవ్ర ఉత్కంఠ రేపుతోంది.

అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూటమి ధర్మానికి కట్టుబడి తాము కొంత తగ్గామని, ఇప్పుడు తగ్గేదేలే అంటూ జనసేన నేతలు ప్రకటనలు చేస్తున్నారు. తమ బలానికి తగినట్లు సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఫలితంగా మంత్రి లోకేశ్ చెప్పిన లెక్కకు అంగీకరించేది లేదన్నట్లు జనసేన పార్టీ వైఖరి ఉందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. కూటమి సర్దుబాటులో భాగంగా నామినేటెడ్ పదవుల విషయంలో 80:15:5 ప్రాతిపదికన పదవులను పంచుకున్నారని చెబుతున్నారు. ఇప్పుడు ఈ విధంగానే స్థానిక ఎన్నికల్లో సరిపెట్టుకోమంటే తమకు పోటీ చేసే అవకాశం రాదని జనసేనలో ఎక్కువ మంది నేతలు ఆందోళన చెందుతున్నారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే మంత్రి నాదెండ్ల ఈ విషయంలో కల్పించుకుని జనసేన కేడర్ కు భరోసా ఇచ్చేలా మాట్లాడారని అంటున్నారు. కూటమిని బలోపేతం చేయడానికి కట్టుబడి ఉన్నామని చెబుతూనే తమ బలానికి తగినట్లు సీట్లు ఇవ్వాలని చెప్పడం ద్వారా స్థానిక ఎన్నికల్లో ఎక్కువ సీట్లు దక్కించుకునేలా జనసేన ఒత్తిడి చేసేలా సంకేతాలు పంపుతోందని వ్యాఖ్యానిస్తున్నారు.

కాగా, రెండు రోజుల క్రితం ఏలూరు జిల్లా కైకలూరులో నిర్వహించిన జనసేన చర్చావేదికలో మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ ఎక్కువ స్థానాల్లో పోటీ చేయడం కన్నా, గెలిచే స్థానాల్లో పోటీ చేయడానికి ప్రాధాన్యం ఇస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆయనపై కేడర్ నుంచి ఒత్తిడి ఎక్కువైందని అంటున్నారు. ఇదే సమయంలో జనసేనకు 15 శాతం సీట్లు ఇస్తామని మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించడంతో వారి ఆందోళన మరింత పెరిగిందని వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి నాదెండ్ల మనోహర్ జోక్యం చేసుకుని కార్యకర్తల ఆందోళనలను తగ్గించేలా మాట్లాడారని అంటున్నారు. మొత్తానికి మంత్రులు లోకేశ్, నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యలు బట్టి కూటమిలో స్థానిక ఎన్నికల సీట్ల సర్దుబాటు కొంత సంక్లిష్టంగా మారే పరిస్థితి ఉందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## వైద్యం వికటించడంతో మూడు నెలల పసికందు మృతి



**అన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అన్నవరం సూర్య ఎమర్జెన్సీ హాస్పిటల్ విషాదం నెలకొంది. వైద్యం వికటించి మూడు నెలల పసికందు మృతి చెందింది. రొంప వచ్చింది అని హాస్పిటల్‌లో తల్లిదండ్రులు చేర్పించారు. నర్సులులే డాక్టర్లు.. ఫోన్ ద్వారానే వైద్యం చేశారు. రొంప వచ్చిన మూడున్నర నెలల బాబుకు వైద్యుల నిర్లక్ష్యం వల్లే ప్రాణాలు పోయాయని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. డాక్టర్ల నిర్లక్ష్యం వల్ల ప్రాణాలు కోల్పోయినట్లు ఆరోపిస్తూ బంధువులు ఆందోళనకు దిగారు. ఆసుపత్రి యాజమాన్యంతో పాటు నిర్లక్ష్యంగా వహించిన డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని కొత్తంగి గ్రామ ప్రజలు, మృతి చెందిన చిన్నారి బంధువులు తెలిపారు. ఈ ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని పరిస్థితిని అదుపు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నెల క్రితమే పెళ్లి.. ప్రేయసి కోసం భార్యనే కడతేర్చిన కసాయి



**హొసపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రేయసి కోసం నెలక్రితం పెళ్లి చేసుకున్న జీవితభాగస్వామినే కడతేర్చాడో కసాయి భర్త. ఈ ఘటన కర్ణాటకలోని విజయనగర జిల్లా కూడ్లిగి తాలూకా కె.దిబ్బదహళ్లిలో చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. కె.దిబ్బదహళ్లి వాసి మారేశ్ అదే ప్రాంతానికి చెందిన అనితను గత నెలలో పెళ్లి చేసుకున్నాడు. ఈ వివాహానికి ముందే మారేశ్ ఓ అమ్మాయిని ప్రేమించాడు. పెద్దల ఒత్తిడితో అతడు అనితను పెళ్లి చేసుకున్నాడు. అయితే ఈ పెళ్లి ఇష్టం లేని మారేశ్.. ఎలాగైనా భార్యను అడ్డు తొలగించి తన ప్రేయసితో కలిసుండాలని పథకం వేశాడు. ఈ నేపథ్యంలో ఈనెల 10న అనితను పొలానికి తీసుకెళ్లాడు. అక్కడ మరో స్నేహితుడితో కలిసి గొంతునులిమి హత్యచేశాడు. పొలంలో ఆకస్మికంగా కిందపడి మరణించిందని అందరిని నమ్మించాడు. అనిత కుటుంబ సభ్యులకు అనుమానం రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టిన గుడేకోటె పోలీసులు.. మారేశ్, అతని స్నేహితుడు పీతాంబరి(30), గాయత్రి కలిసి ఈ హత్య చేసినట్లు తేల్చారు. ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## పెళ్లికి అంగీకరించలేదని హత్య చేసి.. ఎలుకల మందు మింగి..



**బెంగుళూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రేమించిన యువతి తనతో పెళ్లికి అంగీకరించలేదని రగిలిపోయిన ఓ యువకుడు దారుణానికి ఒడిగట్టాడు. ఆమెపై కొడవలితో దాడి చేసి చంపాడు. ఈ ఘటన దక్షిణ కన్నడ జిల్లాలో గురువారం సాయంత్రం జరిగింది. దీనికి సంబంధించి పోలీసులు నిందితుడిని శుక్రవారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. లావణ్య, చేతన్ గత కొంతకాలంగా ప్రేమలో ఉన్నారు. అయితే వివాహానికి లావణ్య ఒప్పుకోకపోవడంతో కక్ష పెంచుకున్న చేతన్ ఆమెను అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో బంట్వాలా సమీపంలోని బీసీ రోడ్డులో బస్సు కోసం వేచిచూస్తున్న లావణ్యను కొడవలితో దాడి చేసి చంపి పరారయ్యాడు. నిందితుడు చేతన్ కోసం పోలీసులు గాలింపు చేపట్టి శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులకు ఎలాగైనా దొరికిపోతానని భావించిన చేతన్.. ఎలుకల మందు మింగాడు. పోలీసులు అదుపులోకి తీసుకున్న సమయంలో ఈ విషయం చెప్పడంతో వారు వెంటనే మంగళూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసుల పర్యవేక్షణలో వైద్య సేవలు అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## రూ.150 కోట్ల ఆస్తి వివాదం..

### తండ్రిని కాల్చి చంపిన కుమారుడు




**గాజియాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉత్తర్ ప్రదేశ్ గాజియాబాద్‌లోని మోదీనగర్‌లో 32 ఏళ్ల యువకుడు ఆస్తి కోసం కన్నతండ్రిని పిస్టల్‌తో కాల్చి చంపిన ఘటన చోటుచేసుకుంది. ఏసీపీ భాస్కర్‌వర్మ తెలిపిన వివరాల ప్రకారం.. మోదీనగర్ పోలీస్ స్టేషన్ పరిధి బుడానా గ్రామానికి చెందిన హరి ఓం ఛౌదరి (52) ఆ ప్రాంతంలో సంపన్న రైతు. ఆయనకు గ్రామంలో 47 ఎకరాల భూమితో పాటు దిల్లీ-మేరఠ్ మార్గంలో ఓ షాపింగ్ కాంప్లెక్స్ ఉంది. వాటి విలువ రూ.150 కోట్లు ఉంటుంది. ఆయనకు భార్య అనిత, పెద్ద కుమారుడు నిఖిల్, చిన్న కుమారుడు నీషూ ఉన్నారు. నిఖిల్ మద్యానికి బానిసవ్వడంతో హరి ఓం తరచూ అతడిని మందలించేవారు. హరి ఓం ఇంతకుముందే నిఖిల్‌కు షాపింగ్ కాంప్లెక్స్‌లోని కొన్ని దుకాణాలు, 15 ఎకరాల భూమి రాసిచ్చారు. మిగిలిన ఆస్తిని కూడా తన పేరుపై బదిలీ చేయాలని నిఖిల్ ఒత్తిడి చేశాడు. హరి ఓం అందుకు నిరాకరించారు. బుధవారం రాత్రి నిఖిల్ మద్యం మత్తులో ఇంటికి చేరడంతో తండ్రి మందలించారు. ఈ క్రమంలో ఆస్తి విషయమై ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. నిఖిల్ పిస్టల్‌తో తండ్రిపై కాల్పులు జరిపాడు.

## నడిరోడ్డుపై వృద్ధ దంపతుల దారుణహత్య

**రామకుప్పం, విశ్వం వాయిస్ న్యూస్ :** చిత్తూరు జిల్లా రామకుప్పంలో దారుణం చోటుచేసుకుంది. నడిరోడ్డుపై వృద్ధ దంపతులను దుండగులు కత్తులతో విచక్షణారహితంగా పొడిచి చంపేశారు. మృతులను బండార్లపల్లికి చెందిన వెంకటేశ్ (65), పార్వతమ్మ (60)గా గుర్తించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు.

## నీటి సంపులో దూకి పిల్లలతో సహా తల్లి ఆత్మహత్య

**వెల్దండ గ్రామీణం, విశ్వం వాయిస్ న్యూస్ :** నాగర్‌కర్నూల్ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి ఆత్మహత్యకు పాల్పడింది. వెల్దండ మండలం పోతేపల్లిలో ఈ ఘటన జరిగింది. ఎనుముల శిరీష (23) తమ ఇంటి ఆవరణలో ఉన్న నీటి సంపులో కుమార్తె మానశ్రీ (3), కుమారుడు వర్షిత్ (4 నెలలు)ను పడేసి.. ఆపై తానూ అందులోకి దూకేసింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పిల్లలతో కలిసి శిరీష బలవన్మరణానికి పాల్పడింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కుటుంబ కలహాలే ఈ ఘటనకు కారణంగా తెలుస్తోంది.




**విశ్వం వాయిస్ న్యూస్, కాకినాడ/అన్నవరం:**

వైద్యో నారాయణో హరిః అనాల్సిన చోట కనికరం లేని నిర్లక్ష్యం పడగ విప్పింది. అక్కడ తెల్లకోటు వేసుకున్న దేవుళ్లు లేరు.. ప్రాణాలు కాపాడే అత్యవసర వైద్యం అంతకన్నా లేదు.. ఉన్నదల్లా కాసుల కక్కుర్తి, పసిప్రాణాలంటే లెక్కలేనితనం! కాకినాడ జిల్లా అన్నవరం పట్టణంలోని స్థానిక 'సూర్య ఎమర్జెన్సీ హాస్పిటల్' లో వైద్యుల ఘోర నిర్లక్ష్యం, నిబంధనలకు విరుద్ధంగా సాగిన 'ఫోన్ కాల్ వైద్యం' కారణంగా కేవలం మూడున్నర నెలల పసికందు మృత్యువాత పడింది. సాధారణ రొంప (జలుబు), జ్వరంతో వచ్చిన బాబుకు క్వాలిఫైడ్ డాక్టర్లు లేకుండా, నర్సులే డాక్టర్లుగా మారి వైద్యం అందించడం వల్లే పసిప్రాణం గాల్లో కలిసింది. ఈ దారుణ ఘటనతో కొత్తంగి గ్రామంలో విషాద ఛాయలు అలముకోగా.. ఆసుపత్రి ఎదుట బంధువుల ఆక్రందనలు మిన్నంటాయి.

### డాక్టర్లు లేరు.. నర్సులే సర్వస్వం.. ఫోన్‌లోనే ట్రీట్మెంట్!

బాధిత కుటుంబ సభ్యులు, కొత్తంగి గ్రామస్థులు తెలిపిన నమ్మశక్యం కాని నిజాల ప్రకారం.. తమ మూడున్నర నెలల మగబిడ్డకు రొంప, స్వల్ప జ్వరం రావడంతో తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో శుక్రవారం ఉదయం అన్నవరంలోని సూర్య ఎమర్జెన్సీ హాస్పిటల్‌లో చేర్చారు. అయితే, హాస్పిటల్ బోర్డు మీద పెద్ద పెద్ద పేర్లు ఉన్నప్పటికీ.. లోపల కనీసం ఒక్క డాక్టర్ కూడా అందుబాటులో లేకపోవడం గమనార్హం. చిన్నారి పరిస్థితిపై అక్కడ ఉన్న నర్సులు.. ఫోన్ ద్వారా డాక్టర్లను సంప్రదించి, వారు చెప్పిన మందులు, ఇంజక్షన్లు బాబుకు ఇచ్చారు. క్వాలిఫైడ్ పిడియాట్రీషియన్ (పిల్లల వైద్యుడు) పర్యవేక్షణ లేకుండా, నర్సులు ఇష్టారాజ్యంగా ఇచ్చిన వైద్యం వికటించి మధ్యాహ్నం 3 గంటల సమయానికి ఆ పసికందు ఊపిరి ఆగిపోయింది.

### చికిత్స పేరుతో దోపిడీ.. చేతుల్లో మిగిలింది శవమే!

బాబు పరిస్థితి విషమించినా ఆసుపత్రి సిబ్బంది తల్లిదండ్రుల వద్ద నిజం దాచారు. పైగా బెడ్ ఛార్జీలు, మందులంటూ వారి నుండి వేల రూపాయల డబ్బులు వసూలు చేశారు. తమ బిడ్డ ప్రాణం దక్కితే చాలని భావించి ఆ పేద తల్లిదండ్రులు అడిగినంత సమర్పించుకున్నారు. తీరా డబ్బులు కట్టించుకున్నాక.. బాబు మృతి చెందాడని నిర్దాక్షిణ్యంగా ప్రకటించారు. ఉదయం తమ చేతుల్లో నవ్వుతూ ఆడుకున్న పసిపాప, కేవలం కొన్ని గంటల్లోనే శవమై కనిపించడంతో కన్నతల్లి ఆసుపత్రి ముందే స్పృహతప్పి పడిపోయింది.



### హాస్పిటల్ ముట్టడి – రణరంగంగా మారిన అన్నవరం!

విషయం తెలియగానే కొత్తంగి గ్రామ ప్రజలు, బాబు బంధువులు వందలాదిగా తరలివచ్చి సూర్య ఎమర్జెన్సీ హాస్పిటల్‌ను ముట్టడించారు. "డాక్టర్లు లేకుండా హాస్పిటల్ ఎలా నడుపుతారు? ఫోన్ లో వైద్యం చేసి మా బిడ్డను చంపేస్తారా?" అంటూ ఆసుపత్రి ఫర్నిచర్‌ను, యాజమాన్యాన్ని నిలదీశారు. చిన్నారి మృతదేహంతో రోడ్డుపై బైఠాయించడంతో అన్నవరం ప్రధాన రహదారిపై తీవ్ర ఉద్రిక్తత నెలకొంది, ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది.

### పోలీసుల రంగప్రవేశం.. ప్రజలు డిమాండ్!

సమాచారం అందుకున్న అన్నవరం పోలీసులు భారీ బలగాలతో సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపు చేయడానికి ప్రయత్నించారు. బాధితులకు పూర్తి న్యాయం చేస్తామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన తాత్కాలికంగా శాంతించింది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఆసుపత్రి యాజమాన్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కేవలం బోర్డులు పెట్టుకుని, డాక్టర్లు లేకుండా ఫోన్ల ద్వారా నర్సులతో వైద్యం చేయిస్తూ అమాయకుల ప్రాణాలతో ఆడుకుంటున్న ఇలాంటి 'డెత్ హాస్పిటల్స్' పై వైద్యారోగ్య శాఖ అధికారులు తక్షణమే స్పందించాలి. సూర్య హాస్పిటల్ లైసెన్స్‌ను రద్దు చేసి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన డాక్టర్లను, యాజమాన్యాన్ని కఠినంగా శిక్షించాలని 'ప్రజలు డిమాండ్ చేస్తునారు.

# విశ్వం వాయిస్
అవినీతిపై - అక్షర సమరం...

VISWAMVOICE TELUGU DAILY

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు




శనివారం, 18 జూలై, 2026

www.viswamvoice.com

సత్యం • సమగ్రం • సమాజ బాధ్యత

www.viswamvoice.com







**కాకినాడ, విశ్వం వాయిస్ ప్రతినిధి :** కాకినాడ నగర ప్రజల నిత్య రాకపోకలకు అత్యంత కీలకమైన వంతెనలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరి, ప్రజల ప్రాణాలకు పెను ముప్పుగా మారాయి. అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల ఉదాసీనత కారణంగా ఏ క్షణంలో ఏ వంతెన కూలిపోతుందోనన్న ఆందోళన నెలకొంది. దీనిపై పౌరసంక్షేమ సంఘం కన్వీనర్, సామాజిక కార్యకర్త దూసర్లపూడి రమణరాజు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత శాఖలు ఒకదానిపై మరొకటి బాధ్యత నెట్టకుండా వెంటనే రక్షణ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

**మూడు వంతెనలు... మూడు ప్రాణాపాయాలు**

**160 ఏళ్ల మహాత్మా గాంధీ (జగన్నాధపురం పాత) వంతెన**

బ్రిటిష్ పాలనా కాలంలో నిర్మించిన ఈ వంతెన కాలపరిమితి దాటిపోయిందని, స్తంభాలు, ఇనుప చువ్వలు తుప్పుపట్టి బలహీనపడ్డాయని తెలిపారు. నిషేధాలు ఉన్నప్పటికీ భారీ సరుకు వాహనాలు, ఆర్టీసీ బస్సులు నిరంతరం రాకపోకలు సాగిస్తున్నాయని పేర్కొన్నారు. ఇటీవల సమీప అనుసంధాన వంతెన కూలిన సంఘటనను గుర్తుచేస్తూ, తక్షణ చర్యలు లేకపోతే ఈ వంతెనకూ అదే పరిస్థితి ఎదురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

**37 ఏళ్ల ఎన్టీఆర్ వంతెన**

ఈ వంతెనపై రక్షణ గోడలు పలు చోట్ల ధ్వంసమై, కాంక్రీటు ఊడిపోవడంతో ఇనుప చువ్వలు బయటకు వచ్చాయని తెలిపారు. వాహనం అదుపుతప్పితే నేరుగా కింద ఉన్న సేవా మార్గంపై పడే ప్రమాదం ఉందన్నారు.

**56 ఏళ్ల రెండో పట్టణ రైల్వే ఎగువ వంతెన**

ఈ వంతెనపై రక్షణ గోడలు పలు చోట్ల విరిగిపోవడంతో భారీ కాంక్రీటు శిథిలాలు వేలాడుతున్నాయని చెప్పారు. అవి ఎప్పుడైనా కిందపడితే పాదచారులు, వాహనదారులకు ప్రాణాపాయం తప్పదని హెచ్చరించారు.

పౌరసంక్షేమ సంఘం సూచించిన మూడు తక్షణ చర్యలు

**1.రెండో పట్టణ రైల్వే ఎగువ వంతెన**

వేలాడుతున్న కాంక్రీటు శిథిలాలను వెంటనే తొలగించాలి.

బలమైన రక్షణ గోడలు లేదా ఇనుప కంచెలు ఏర్పాటు చేయాలి.

**2.మహాత్మా గాంధీ వంతెన**

ఇరువైపులా బలమైన ఇనుప రక్షణ దండెలు ఏర్పాటు చేయాలి.

ఆర్టీసీ బస్సులు, భారీ సరుకు వాహనాల రాకపోకలను పూర్తిగా నిషేధించాలి.

**3.ఎన్టీఆర్ వంతెన**

ధ్వంసమైన రక్షణ గోడలను అత్యవసరంగా పునర్నిర్మించాలి.

**రాకపోకల మళ్లింపు తప్పనిసరి**

వంతెనలపై ఒత్తిడి తగ్గించేందుకు రాకపోకలను ప్రత్యామ్నాయ మార్గాల వైపు మళ్లించాలని పౌరసంక్షేమ సంఘం సూచించింది.

**ఆర్టీసీ బస్సులు**

ప్రధాన బస్ సముదాయం – భానుగుడి కూడలి – బాలాజీ చెరువు – ఎన్టీఆర్ వంతెన – జగన్నాధపురం వైపు.

**భారీ సరుకు వాహనాలు**

ఎం.ఎస్.ఎన్. పాఠశాల – జగన్నాధపురం – అన్నమ్మ ఘాట్ – ఎన్టీఆర్ వంతెన – పాత బస్టాండ్ – బాలాజీ చెరువు – కల్పన కూడలి – భానుగుడి – సర్పవరం కూడలి.

**విశాఖపట్నం / కత్తిపూడి వైపు నుంచి వచ్చే వాహనాలు**

సర్పవరం కూడలి – వాకలపూడి – సముద్రతీర రహదారి – పాత లేదా కొత్త నౌకాశ్రయం.

**రాజమహేంద్రవరం / సామర్లకోట వైపు నుంచి వచ్చే వాహనాలు**

ఏడీబీ రహదారి – తిమ్మాపురం లేదా అచ్యుతాపురం ప్రత్యామ్నాయ మార్గం – సముద్రతీర రహదారి.

**కోనసీమ / యానాం వైపు వెళ్లే వాహనాలు**

చీడిగ కూడలి లేదా నాలుగు వరుసల ప్రత్యామ్నాయ రహదారి మీదుగా ఉప్పుటేరు దాటి వెళ్లాలి.

**ప్రభుత్వం వెంటనే స్పందించాలి**

ఈ మార్పులను అమలు చేస్తే పాత జగన్నాధపురం వంతెనపై రద్దీ గణనీయంగా తగ్గి, ప్రమాదాలను నివారించవచ్చని సామాజిక కార్యకర్త దూసర్లపూడి రమణరాజు తెలిపారు. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ఆలస్యం చేయకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని ఆయన కోరారు.

---

వానలు కురవాలని

## వినాయకునికి పూజలు



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** రావులపాలెం మండలం ఈతకోట గ్రామంలోవానలు కురవాలని విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మహిళలు మండలం పరిధిలోని ఈతకోట గ్రామంలో శుక్రవారం నాడు వినాయకునికి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు వర్షాలు కురవకపోవడంతో గ్రామంలో శ్రీ సుబ్బారాయుడు గుడి వెళ్లే దారిలో బీసీ కమ్యూనిటీ హాల్ సమీపంలో ఉన్న శ్రీ విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారికి మహిళలు పసుపు కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించి బిందెలతో నీళ్లు పోసి వానలు కురవాలని అభిషేకించారు విఘ్నాలు తొలగించే ఆది గణపతి గ్రామాలను గ్రామ ప్రజల్ని కాపాడాలని వర్షాలు కురవాలని పచ్చగా పంటలు పండాలని ప్రత్యేక పూజలుతో అభిషేకాలు నిర్వహించి హారతులిచ్చి స్వామివారిని మహిళలు ప్రజలు వేడుకున్నారు వానదేవుడు కరుణించాలని కోరుకున్నారు.

---


## ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో డాక్టర్ నాగ మానస ముమ్మర పరిశీలన

**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేటలో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలి ఆకస్మిక తనిఖీలు విద్యార్థి మృతిపై ఆరా. హాజరు పట్టికల తనిఖీ కొత్తపేట రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు డాక్టర్ కె. నాగ మానస శుక్రవారం కొత్తపేట మండలంలోని పలు ప్రభుత్వ విద్యాసంస్థలు, వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాల్లో ముమ్మరంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, ఎస్సీ బాలుర మరియు బాలికల సంక్షేమ హాస్టళ్లతో పాటు శ్రీనివాసపేటలోని మండల పరిషత్ మోడల్ ప్రైమరీ స్కూల్, స్థానిక అంగన్వాడీ కేంద్రాలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికలను తనిఖీ చేసిన ఆమె, బడికి సక్రమంగా రాని విద్యార్థులపై ప్రధానోపాధ్యాయులు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు.ఇటీవల బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఒక విద్యార్థి మృతి చెందిన ఘటనపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించి, బాలబాలికలకు ఏమైనా ఇబ్బందులు ఉంటే నేరుగా తనకు తెలియజేయాలని భరోసా ఇచ్చారు.అలాగే విద్యార్థులకు ఆరోగ్య సిబ్బంది ద్వారా బ్లడ్ గ్రూప్ నిర్ధారణ పరీక్షలు



నిర్వహించి, ఆ వివరాలను పాఠశాల రికార్డుల్లో భద్రపరచాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేసిన కమీషన్ సభ్యురాలు, బాలికల ఉన్నత పాఠశాలలో టాయిలెట్ల నిర్వహణ సరిగా లేకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలల్లో ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సీడీపీఓ ఎ.గజలక్ష్మి, ఎంఈఓలు ఎం.హరిప్రసాద్, కె.లీలావతి, ప్రధానోపాధ్యాయులు ఏ.ఉషారాణి, కె.సత్యనారాయణ, వైద్య ఆరోగ్యశాఖ మరియు స్త్రీ శిశు సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

---



## స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంకండి


**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** జనసేన పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన కార్యకర్తలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యం కల్పిస్తామని పార్టీ నాయకులు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేసిన ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. గ్రామ, వార్డు స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి ఎన్నికల్లో అవకాశం కల్పించడం ద్వారా కార్యకర్తల సేవలకు తగిన గుర్తింపు ఇవ్వనున్నట్లు నాయకులు స్పష్టం చేశారు.

---

## రాజోలులో వైసీపీ బలోపేతమే లక్ష్యం : దంగేటి రాంబాబు



**రాజోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజోలు నియోజకవర్గంలో వైసీపీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేస్తామని కొత్తగా నియమితులైన నియోజకవర్గ పరిశీలకుడు దంగేటి రాంబాబు తెలిపారు. చల్లపల్లిలో రాంబాబును నియోజకవర్గం కో–ఆర్డినేటర్ పాముల రాజేశ్వరిదేవితో పాటు పార్టీ శ్రేణులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ విజయమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేఎస్ఎన్ రాజు, కటకంశెట్టి ఆదిత్య, ప్రకాష్ పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్
శనివారం, 18 జూలై 2026
www.viswamvoice.com








**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** శివారు భూములకు సైతం నీరందించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యం. వైసీపీ హయాంలో నీటిపారుదల వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది.ఎల్ నినో ప్రభావంతో తలెత్తిన ఇబ్బందులను పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని మంత్రులు నిమ్మల రామానాయుడు, వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. కాలువ చివరి భూముల వరకు సాగునీరు అందించడమే లక్ష్యంగా అవిశ్రాంతంగా కృషి చేస్తున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కొత్తపేట ఎమ్మెల్యే పేర్కొన్నారు. శుక్రవారం సెంట్రల్ డెల్టా వాటర్ మేనేజ్మెంట్ పర్యవేక్షణలో భాగంగా మంత్రి నిమ్మల రామానాయుడు బొబ్బర్లంక నుంచి లొల్ల లాకుల నుండి పలివెల లాకులు వరకు ఎమ్మెల్యే బండారుతో కలిసి మోటార్ సైకిల్‌పై పర్యటించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు.ముందుగా లొల్ల లాకుల వద్ద ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే బండారు కొత్తపేట జనసేన ఇన్చార్జి బండారు శ్రీనివాస్, ఆకుల రామకృష్ణ, గుబ్బల శ్రీనివాసరావు తదితరులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ గోదావరి డెల్టా అంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గుండెకాయ లాంటిదని వ్యాఖ్యానించారు. అటువంటి గోదావరి డెల్టా రైతులు సైతం నేడు సాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కోవడానికి రెండు కారణాలున్నాయని ఒకటి సూపర్ ఎల్ నినో అయితే రెండవది వైసిపి ఐదేళ్ల పాలనలో సాగునీటి వ్యవస్థలో జరిగిన విధ్వంసం అన్నారు. 70 ఏళ్ల చరిత్రలో 15 వేల క్యూసెక్కుల నీరు గోదావరిలోకి జూలై నెలలో రావడం ఇదే ప్రథమమని నీటిపారుదల శాఖ అధికారులు తెలుపుతున్నారన్నారు. ఎప్పుడైనా గోదావరిలో నీటి ఇబ్బందులు ఎదురైతే సీలేరు నుంచి మార్చి,ఏప్రిల్ నెలలో నీటిని తీసుకుంటామని, అయితే ఇప్పుడు సూపర్ ఎల్నినో కారణంగా జూలై నెలలోనే 5000 క్యూసెక్కుల నీరుని సీలేరు నుంచి తీసుకుని గోదావరి డెల్టాకు పంపిస్తున్నామన్నారు. గోదావరిలో నీటిమట్టాలు ఏ మాదిరిగా అడుగంటాయో దీన్ని బట్టి అర్థమవుతుందన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని నీటి యాజమాన్యాలను నీటిపారుదల శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు, రైతులు సమన్వయం చేసుకోవాలని, కాలువలు లాకులు, షట్టర్లు ఏ విధంగా ఉన్నాయి? ప్రతి చోటా రీడింగ్ లు ఎలా ఉన్నాయి? ఎంత ఇన్ఫ్లో, ఎంత అవుట్ ఫ్లో పంపిస్తున్నారనేది కిందిస్థాయి వరకు పరిశీలిస్తూ ఉండాలన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అంటే ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వం అన్నారు. సంక్షోభం వచ్చింది అంటే కాలువల వద్ద, పొలాల వద్ద, గట్ల వద్ద తిరిగే నాయకత్వమే ఉంటుందన్నారు. అందుకనే నేడు ధవలేశ్వరం హెడ్ స్లూయిస్ దగ్గర నుంచి లొల్లలాకులు మొదలుకుని అమలాపురం,పి గన్నవరం, ముమ్మిడివరం శివారు ప్రాంతాల వరకు లాకులను, నీటిపారుదలను పరిశీలిస్తూ అధికారులకు అందరికీ సూచనలు చేస్తూ పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వర్షపాతం తక్కువ ఉన్న, గోదావరిలో నీటి పరిమాణం తక్కువగా ఉన్న, నీటిని అందించడానికి పరిపూర్ణమైన కృషి చేస్తున్నామని అయినా శివారు ప్రాంతాల్లో నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నారన్నారు. ఎక్కడైనా నీరు ఓవర్ ఫ్లో అవుతుంటే అక్కడ నీటిమట్టాలను తగ్గించడం, ఎక్కడైతే నీటి ప్రవాహానికి అడ్డంకులు ఉన్నాయో అక్కడ సత్వరంగా పనులు చేపట్టడం చెయ్యాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. తక్కువ నీటి యాజమాన్యంతో, తక్కువ కాల పరిమితితో కూడిన పంటలని పండించాలని రైతులకు సూచించారు. అవసరమైతే వంతుల వారీ విధానాన్ని సైతం నీటిపారుదల సంఘాలు, రెవిన్యూ అధికారులు, రైతులతో సమన్వయం చేసుకోవాలని నీటిపారుదల శాఖ అధికారులకు సూచించినట్లు తెలిపారు. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ వైసీపీ హయాంలో నీటిపారుదల శాఖ అంటే సెంటు పర్సెంటా, అరపర్సెంటా అని చెప్పేవాళ్ళు ఒకరు మంత్రిగా ఉంటే, నేను రోజుకు ప్రత్యర్థులను ఇన్ని బూతులు తిట్టాను అని జగన్ కు చూపించే వ్యక్తి మరొకసారి మంత్రిగా ఉన్నారని విమర్శించారు. వైసీపీ హయాంలో నీటిపారుదల శాఖను పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు.రైతులు పదివేళ్ళు మట్టిలో పెడితేనే ప్రజల ఐదు వేళ్ళు నోట్లోకి వెళ్తాయనే ఉద్దేశంతో రైతుల పక్షాన కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. నిమ్మల రామానాయుడు రాష్ట్రమంతా పర్యటిస్తూ రైతుల కోసం ఎంతగానో శ్రమిస్తున్నారని ప్రశంసించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాను విశ్రాంతి తీసుకోరని మంత్రులను, ఎమ్మెల్యేలను ఎవ్వరిని విశ్రాంతి తీసుకోనివ్వకుండా ప్రజల కోసం పనిచేయిస్తారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్, నిమ్మల రామానాయుడు నిత్యం శ్రామికుల్లా రాష్ట్ర అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తుంటే ఏదో ఆరోపణలు చేయాలి, వివాదాలు సృష్టించాలి అనే ఉద్దేశంతో వైసిపి నాయకులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. వైసీపీ పాలనలో ఇరిగేషన్ మంత్రులుగా పనిచేసిన ఇద్దరు కూడా ప్రస్తుత నీటిపారుదల శాఖ మంత్రి రామానాయుడుతో చర్చకు వస్తే మరలా ఎన్నడూ వారు మీడియాకు ముఖం చూపించారన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ గోదావరి డెల్టాపై గొడ్డలి పార్టీ ఐదేళ్ల నిర్లక్ష్య వైఖరి ఈనాడు రైతులకు శాపంగా మారిందని అన్నారు. రైతులకు ఏ విధంగానైనా న్యాయం చేయాలనే ధోరణితో జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు పనిచేస్తున్నారన్నారు. ఒక రైతు బిడ్డ జల వనరుల శాఖామంత్రి అయితే ఆ శాఖ పనితీరు ఎంత అద్భుతంగా ఉంటుందో నిమ్మల రామానాయుడు చేసి చూపిస్తున్నారన్నారు. ఎక్కడ రైతులకు ఇబ్బంది ఎదురైనా అక్కడకు ఆయన వెళ్లి సమస్యల పరిష్కారానికి అనునిత్యం కృషి చేస్తున్నారన్నారు. బుడమేరు వరదలు విజయవాడను ముంచెత్తిన సమయంలో ఒక గొడుగు పట్టుకుని పెనుగాలులు వేస్తున్నా దగ్గరుండి పని చేయించిన వ్యక్తి నిమ్మల రామానాయుడని ప్రశంసించారు. ఈరోజు పట్టిసీమ వల్ల కృష్ణ డెల్టా ఊపిరి పోసుకుందన్నారు. ధవలేశ్వరం బ్యారేజీ గేట్ల పునరుద్ధరణ పనులు చేపట్టడం, లొల్లలాకుల పునర్నిర్మాణానికి నిధులు కేటాయించడం వంటి చర్యలతో రాష్ట్రంలోనే జలకళ సంతరించుకునేలా కృషి చేస్తున్నారన్నారు. గోదావరి డెల్టా రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన చర్యలపై స్వయంగా ఆయనే వచ్చి మోటార్ సైకిల్ పై పర్యటించి, పరిశీలన చేసి, క్షేత్రస్థాయిలో పరిస్థితులను కళ్ళారా చూసి దానికి తగిన పరిష్కారాలు అన్వేషించడం ఆయన యొక్క నిబద్ధతకు నిదర్శనమన్నారు. లొల్ల, మెర్లపాలెం రైతులకు ముంపు సమస్య ఉండగా, పంపింగ్ స్కీముల సమస్యలను సైతం పరిశీలించారన్నారు. బొబ్బర్లంక నుంచి మురమళ్ళ వరకు మోటారు సైకిల్ మీద ప్రయాణం చేసి రైతుల సమస్యలను మంత్రి తెలుసుకోవడం నిజంగా అభినందనీయమన్నారు. నీటి ఎద్దడి ఉన్నప్పుడు ప్రత్యామ్నాయ పంటల సాగుపై సైతం రైతులు దృష్టి పెట్టాలన్నారు. గోదావరి డెల్టా ఆధునీకీకరణకు సైతం ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తుందని, ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హయాంలో తప్పకుండా ఈ బృహత్ కార్యక్రమం జరిగి తీరుతుందన్నారు. ప్రజలు కూడా కొన్ని అంశాలు గమనించాలన్నారు. ధవలేశ్వరం బ్యారేజీ మరమ్మత్తులు కానీ, లొల్ల లాకులకు గాని 2014 - 19 తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మాత్రమే గేట్లు పెట్టినా,గ్రీజులు పూసినా, ఏ విధమైన నిర్వహణ పనులు చేసినా అప్పుడు మాత్రమే జరిగాయన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ధవలేశ్వరం బ్యారేజీ, లొల్లలాకులకు కనీస మరమ్మత్తులు సైతం చేయలేదన్నారు. రైతులు సైతం ఇవన్నీ గుర్తించాలన్నారు. కూటమి ప్రభుత్వం రైతులపై ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తుందన్నారు.

### ఉప ముఖ్యమంత్రి పవన్‌ని

## పరామర్శించిన ఎమ్మెల్యే గిడ్డి



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** కుడి భుజానికి శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్‌ని హైదరాబాదులోని ఆయన నివాసంలో పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ మర్యాదపూర్వకంగా పరామర్శించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి ప్రజాసేవలో మరింత ఉత్సాహంగా పాల్గొనాలని ఆకాంక్షించారు. అలాగే వైద్యుల సూచనలను పూర్తిగా పాటిస్తూ తగిన విశ్రాంతి తీసుకోవాలని కోరుతూ, ఆయన త్వరితగతిన కోలుకోవాలని మనస్ఫూర్తిగా అభిలషించారు.

### చివరకు న్యాయం గెలిచింది..

## రాజకీయ కక్ష ఓడింది!

### జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు ముత్యాల బాబ్జి



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అక్రమ కేసులతో చంద్రబాబుని, పలువురు టిడిపి నేతలను వేధించారు.చివరకు న్యాయం గెలిచింది. రాజకీయ కక్ష ఓడిందని జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు ముత్యాల బాబ్జి తన ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతి అసైన్డ్ భూముల కేసులో హైకోర్టు చారిత్రాత్మక తీర్పు గత పాలకులకు చెంపపెట్టు అన్నారు. చట్టబద్ధంగా తీసుకున్న పరిపాలనా నిర్ణయాలను నేరాలుగా చిత్రీకరించి, రాజకీయ ప్రత్యర్థులను జైలుకు పంపాలన్న జగన్మోహన్ రెడ్డి ప్రయత్నం బెడిసి కొట్టింది.ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తాజాగా ఇచ్చిన తీర్పు ఈ మాటనే మరోసారి రుజువు చేసింది.అమరావతిలో అసైన్డ్ భూముల మార్పిడికి సంబంధించి జీఓ 141ను చట్టబద్ధంగానే తీసుకొచ్చినట్టు కోర్టు స్పష్టం చేసింది. ఈ జీఓ వల్ల నష్టపోయినట్టు ఒక్క రైతు కూడా కోర్టు తలుపు తట్టలేదు అన్న వాస్తవాన్నే న్యాయస్థానం ప్రధానంగా ప్రస్తావించింది. బాధితులే లేని చోట, నేరమేమిటి? ఫిర్యాదు చేసిన వ్యక్తి ఆళ్ల రామకృష్ణారెడ్డి ఉద్దేశం వెనుక ప్రజాప్రయోజనం లేదని, దురుద్దేశమే కనిపిస్తోందని కోర్టు నేరుగా వ్యాఖ్యానించడం ఈ తీర్పులో అత్యంత కీలకమైన అంశం. ప్రజాస్వామ్యానికి హెచ్చరిక ఈ తీర్పులో అత్యంత ప్రాధాన్యం సంతరించుకున్న అంశం - "పరిపాలనాపరమైన నిర్ణయాలకు నేరపూరిత చర్యలను ఆపాదిస్తే ప్రజాస్వామ్యం మనుగడకే ప్రమాదం" అన్న కోర్టు వ్యాఖ్య. అధికారంలో ఉన్నవారు తమ ముందున్న ప్రభుత్వ నిర్ణయాలను రాజకీయ కోణంలో చూసి కేసులు పెట్టడాన్ని న్యాయస్థానాలు అడ్డుకట్ట వేయకపోతే, రేపు ఏ ప్రభుత్వమైనా ప్రత్యర్థులపై కక్ష సాధించే ఆయుధంగా పోలీసు యంత్రాంగాన్ని వాడుకునే ప్రమాదం పొంచి ఉంటుంది. ఈ కోణంలో చూస్తే, హైకోర్టు తీర్పు కేవలం ఇద్దరు వ్యక్తులకు ఊరటనిచ్చే తీర్పు మాత్రమే కాదు - రాజకీయ కక్ష సాధింపు సంస్కృతికి చెక్ పెట్టే ప్రయత్నం.న్యాయం ఆలస్యమైనా,చివరకు అది గెలిచింది.ఇది కేవలం ఒక తీర్పు కాదు.రాజకీయ కక్ష సాధింపులు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని చెప్పే గట్టి సందేశం అని జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు ముత్యాల బాబ్జి తన అభిప్రాయాన్ని వెల్లడించారు.

### అమలాపురం ఎర్రవంతెన వద్ద

## నిత్యం ట్రాఫిక్ జామ్ కష్టాలు

**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం పట్టణంలోని ఎర్రవంతెన వద్ద నిత్యం భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజువారీగా గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఉదయం సమయంలో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి సమయానికి పాఠశాలలకు చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సేవల వాహనాలు సైతం ట్రాఫిక్ కారణంగా నెమ్మదిగా కదులుతున్న పరిస్థితి కనిపిస్తోంది. పట్టణం గుండా ట్రావెల్స్ బస్సులు అధిక సంఖ్యలో రాకపోకలు సాగించడం వల్ల ట్రాఫిక్ మరింత తీవ్రతరమవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ట్రావెల్స్ బస్సులను ఈదరపల్లి వంతెన నుంచి బైపాస్ మార్గం మీదుగా



మళ్లించాలని, ఎర్రవంతెన వద్ద ట్రాఫిక్ నియంత్రణకు శాశ్వత చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు పోలీసు అధికారులు, సంబంధిత అధికారులను కోరుతున్నారు.

### రామచంద్రపురం సమగ్ర అభివృద్ధికి

## రూ.14.14 కోట్లతో పనులను ప్రారంభించిన మంత్రి వాసంశెట్టి

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పట్టణ సమగ్ర అభివృద్ధికి రూ.14.14 కోట్లతో చేపట్టనున్న ఆరు రకాల అభివృద్ధి పనులకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం శ్రీకారం చుట్టారు. మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.ఆర్. రాజు, జనసేన ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, ఈఈ హుస్సేన్, డిఈ శ్రీకాంత్ మరియు కూటమి పార్టీ నాయకులతో కలిసి ఆయన ఈ పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో రామచంద్రపురం పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే అమృత్ 2.0 పథకం కింద 8వ వార్డు విజయదుర్గా నగర్‌లో రూ.13.40 కోట్ల వ్యయంతో, 2.50 లక్షల లీటర్ల సామర్థ్యంతో చేపట్టనున్న తాగునీటి సరఫరా మెరుగుదల పథకానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే పట్టణ ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందుబాటులోకి వస్తుందన్నారు.



వీటితో పాటు 4వ వార్డు పసుపులేటి సత్తిబాబు ఇంటి సమీపంలో రూ.12.35 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం, అదే వార్డులోని అరుంధతి నగర్ - రాజబాబు నగర్ పార్క్ ఓపెన్ సైట్‌లో రూ.15.39 లక్షలతో చిన్నారుల ఆట పరికరాల ఏర్పాటు పనులను ప్రారంభించారు. అలాగే 2వ వార్డు కనకదుర్గమ్మ ఆలయం నుండి కొత్తూరు రోడ్డు వరకు రూ.7.75 లక్షలతో సీసీ రోడ్డు, 28వ వార్డు శ్యామల సూపర్ బజార్ వరకు రూ.8.72 లక్షలతో సీసీ డ్రెయిన్, 20వ వార్డు కేఎస్ఆర్ నగర్ పార్కుకు రూ.30.66 లక్షలతో కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను ముమ్మరంగా చేపట్టామని మంత్రి వివరించారు. గత రెండేళ్ల కాలంలోనే రామచంద్రపురం పట్టణంలో సుమారు రూ.50 కోట్లతో రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు, పార్కులు, విద్యుత్ సౌకర్యాల మెరుగుదల వంటి పలు అభివృద్ధి పనులను విజయవంతంగా పూర్తి చేశామని మంత్రి గుర్తుచేశారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందిస్తూ, వారి జీవన ప్రమాణాలను పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, భవిష్యత్తులో మరిన్ని నిధులు తీసుకువచ్చి రామచంద్రపురాన్ని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఉండవెల్లి శివ, మున్సిపల్ అధికారులు, కూటమి పార్టీల నాయకులు, ఆయా వార్డుల ప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

కాకినాడ జిల్లా ఎడిషన్

శనివారం, 18 జూలై 2026
www.viswamvoice.com





# అత్యంత ప్రతిష్టాత్మకంగా మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ విద్యా శాఖ అధికారులను ఆదేశం



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా స్థానిక కలెక్టరేట్ నుండి మండలాల ఎంపీడీఓలు, ఎంఈఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మెగాపేరెంట్, సైనింగ్ స్టార్స్ సన్మాన కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లోవిద్యాప్రమాణాలను మెరుగు పరచడానికి, విద్యా ర్థుల ప్రగతి లో తల్లి దండ్రులనుభాగస్వాములను చేయడానికి రాష్ట్ర ప్రభు త్వం మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ అనే వినూత్న కార్యక్రమాన్ని ఈనెల 24న అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని, గతంలో కార్పొరేట్ పాఠశాలలకే పరిమితమైన ఈ విధానాన్ని, ప్రభుత్వ పాఠశాలల్లో విప్లవాత్మక మార్పుల కోసం విస్తృతంగా అమలు చేస్తున్నారన్నారని, విద్యార్థుల చదువు, క్రమశిక్షణ కేవలం ఉపా ధ్యాయులదే కాకుండా, తల్లిదండ్రుల బాధ్యత కూడా అనే భావనను పెంపొందించడం ప్రధాన ఉద్దేశమన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు, ఉపాధ్యాయుల బోధనా తీరుపై తల్లి దండ్రుల నుంచి ప్రత్యక్షంగా ఫీడ్‌బ్యాక్ సేకరించాలన్నారు. ఏకకాలంలో మెగా పేరెంట్ టీచర్ సమావేశాలు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ఎయిడెడ్, అన్-ఎయిడెడ్ పాఠశాలలు మరియు జూనియర్ కళాశాలల్లో ఒకే రోజు నిర్వహించాలని అధిక సంఖ్యలో తల్లిదండ్రులు వారి పిల్లల విద్యా సామర్థ్యాలను తెలుసుకునేందుకు విచ్చేస్తారని వారికి అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు.నిర్వహణ పారదర్శకత కోసం ప్రతి పాఠశాల తాలూకు హాజరు వివరాలు, ఫొటోలు, వీడి యోలను ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన లీప్ యాప్ ద్వారా అప్‌లోడ్ తో డిజిటల్ పర్యవేక్షణ చేస్తారన్నారు. మెగా పీటీఎం అనేది కేవలం ఒక సమావేశంలా కాకుండా, ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసే ఒక జిల్లా స్థాయి పండుగలా నిర్వహించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ. రమేష్ సమగ్ర శిక్ష ఏపీసీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్

## మాజీ ఎమ్మెల్యే 'పిల్లి' ఆధ్వర్యంలో వినతుల స్వీకరణ



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో వాకలపూడి గ్రామంలో తమ నివాసం వద్ద ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై తమ సమస్యలు, అభ్యర్థనలు, స్థానిక అవసరాలకు సంబంధించిన వినతిపత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ప్రజలు తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, సంక్షేమ పథకాల అమలు, తల్లికి వందనం,రెవెన్యూ, పెన్షన్లు, గృహాలు, ఇతర ప్రజా సమస్యలకు సంబంధించిన వినతులను అందజేశారు. ప్రతి వినతిని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి సత్యనారాయణ మూర్తి స్వయంగా స్వీకరించి, సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండటం, వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించడమే ప్రజాదర్బార్ ప్రధాన ఉద్దేశమని వారు తెలిపారు. ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే తమ ప్రథమ ప్రాధాన్యత అని పేర్కొంటూ, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# న్యాయవాదుల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలి

## ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐఎల్ఏ) డిమాండ్



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** న్యాయవాదుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ కాకినాడ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఐఎల్ఏ ఆధ్వర్యంలో శుక్రవారం కాకినాడ కలెక్టరేట్లో డిఆర్ఓ టి.శిప్పే నాయక్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలూరు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సమాజంలో న్యాయవాదుల పాత్ర కీలకమని వీరి భద్రతకు సంక్షేమానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ముఖ్యంగా అడ్వకేట్స్ రక్షణ చట్టం చేసి అమలు చేయాలని, అర్హులైన న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ ఐఎల్ఏ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు టి.పృథ్వీరాజ్ మాట్లాడుతూ న్యాయవాదులకు ఆరోగ్య భీమా కార్డులను మంజూరు చేయాలని, జూనియర్ న్యాయవాదులకు నెలకు పదివేలు చొప్పున ఐదు సంవత్సరాలు స్టైఫండ్ ఇవ్వాలని కోరారు. కాకినాడ బార్ అసోసియేషన్ నుంచి ప్రారంభమైన న్యాయవాదుల ర్యాలీ కలెక్టరేట్ చేరుకుని న్యాయవాదుల డిమాండ్లను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని నినదించారు. ఈ కార్యక్రమంలో ఐ ఎల్ ఏ జిల్లా ఉపాధ్యక్షులు కోలా శ్రీహరావు, మహిళా కన్వీనర్ డాక్టర్ వసంత, ఐ ఎల్ ఏ జిల్లా నాయకులు జెవి రమణ, మంగా వెంకట శివరామకృష్ణ, కాకినాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎం సరోజిని, కోశాధికారి పితాని శ్రీదేవి, సీనియర్ న్యాయవాదులు బి గోకుల కృష్ణ, సయ్యద్ సాలార్, గెద్దాడ వెంకటేశ్వరరావు, కలిదిండి శ్రీనివాసరావు, కే వీరభద్రరావు, నక్క వెంకట నరసింహారావు అధిక సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.

# పార్కిన్సన్స్‌కు యశోద ఆసుపత్రిలో అత్యాధునిక డీబీఎస్ చికిత్స

## మందులు పనిచేయని దశలోనూ కదలికలకు ఊతమిచ్చే అత్యాధునిక చికిత్స - యువతలోనూ పెరుగుతున్న పార్కిన్సన్స్ కేసులపై వైద్య నిపుణుల హెచ్చరిక
## అమలాపురంలో యశోద ఆసుపత్రి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం : డాక్టర్ రాజేష్ అలుగోలు




**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఒకప్పుడు వృద్ధాప్యంతో ముడిపడిన వ్యాధిగా భావించిన పార్కిన్సన్స్ ఇప్పుడు యువతను సైతం వేధిస్తున్న నరాల క్షీణత సమస్యగా మారిందని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. జీవనశైలిలో వస్తున్న మార్పులు, పెరుగుతున్న ఒత్తిడి, పర్యావరణ ప్రభావాలు వంటి అనేక కారణాలతో ఈ వ్యాధి కేసులు క్రమంగా పెరుగుతున్నాయని వారు పేర్కొన్నారు. అయితే వైద్యరంగంలో అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక సాంకేతికతతో పార్కిన్సన్స్ బాధితులకు మళ్లీ సాధారణ జీవితాన్ని అందించే అవకాశం ఏర్పడిందని వివరించారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు అమలాపురంలో హైదరాబాద్ హైటెక్ సిటీ యశోద ఆసుపత్రి ఆధ్వర్యంలో ప్రత్యేక విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూరో సర్జరీ, మూవ్‌మెంట్ డిజార్డర్స్ నిపుణుడు డాక్టర్ రాజేష్ అలుగోలు పార్కిన్సన్స్ వ్యాధి స్వభావం, లక్షణాలు, చికిత్సా విధానాలపై సమగ్రంగా వివరించారు. ఆయన మాట్లాడుతూ, మన శరీరంలోని కదలికలను నియంత్రించే మెదడులోని ప్రత్యేక కణాలు డోపమైన్ అనే రసాయనాన్ని ఉత్పత్తి చేస్తాయని, ఈ కణాలు క్రమంగా దెబ్బతినడం వల్ల డోపమైన్ ఉత్పత్తి తగ్గి పార్కిన్సన్స్ వ్యాధి వస్తుందని చెప్పారు. ప్రారంభంలో చేతులు వణకడం, కాళ్లలో వణుకు, నడకలో అస్థిరత, శరీరం గట్టిపడటం, చిన్న చిన్న పనులు చేయడంలో ఇబ్బందులు, ముఖ కవళికలు తగ్గిపోవడం, మాట్లాడే తీరు మారడం వంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. కొందరిలో జ్ఞాపకశక్తి మందగించడం, నిద్రలేమి, ఆందోళన, డిప్రెషన్ వంటి సమస్యలు కూడా ఈ వ్యాధితో పాటు కనిపించే అవకాశముందని వివరించారు. పార్కిన్సన్స్‌ను పూర్తిగా నయం చేసే మందు ఇప్పటికీ అందుబాటులో లేకపోయినా, ప్రారంభ దశలో మందుల ద్వారా వ్యాధిని సమర్థవంతంగా నియంత్రించవచ్చని చెప్పారు. అయితే కాలక్రమేణా మందుల ప్రభావం తగ్గిపోవడం వల్ల రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని, అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ (డీబీఎస్) శస్త్రచికిత్స అత్యంత ప్రభావవంతమైన చికిత్సగా నిలుస్తోందని వివరించారు. డీబీఎస్ విధానంలో మెదడులో అత్యంత ఖచ్చితమైన ప్రాంతాల్లో సన్నని ఎలక్ట్రోడ్లను అమర్చి, వాటిని ఛాతీ భాగంలో అమర్చే చిన్న పరికరంతో అనుసంధానిస్తారని చెప్పారు. ఈ పరికరం పంపే నియంత్రిత విద్యుత్ తరంగాలు మెదడులోని అసాధారణ సంకేతాలను సరిచేసి, చేతుల వణుకు, కండరాల బిగుతు, నడకలో తడబాటు వంటి లక్షణాలను గణనీయంగా తగ్గిస్తాయని తెలిపారు. దీంతో రోగులు మళ్లీ స్వతంత్రంగా నడవడం, భోజనం చేయడం, రాయడం, దుస్తులు ధరించడం వంటి రోజువారీ పనులను ఇతరుల సహాయం లేకుండానే చేసుకునే స్థితికి చేరుకుంటారని పేర్కొన్నారు. ఇటీవల ప్రచారంలోకి వచ్చిన కోతలేని అల్ట్రాసౌండ్ చికిత్సతో పోలిస్తే, డీబీఎస్ వైద్యపరంగా మరింత విశ్వసనీయమైన, శాస్త్రీయ ఆధారాలు కలిగిన విధానమని చెప్పారు. ముఖ్యంగా మెదడుకు ఇరువైపులా సురక్షితంగా చికిత్స అందించే అవకాశం డీబీఎస్‌లో ఉంటుందని, రోగి పరిస్థితికి అనుగుణంగా పరికరం పనితీరును భవిష్యత్తులోనూ సర్దుబాటు చేసుకునే వెసులుబాటు ఉండటం దీని ప్రత్యేకత అని వివరించారు. దీని వల్ల వ్యాధి తీవ్రతలో వచ్చే మార్పులకు అనుగుణంగా చికిత్సను కొనసాగించవచ్చని తెలిపారు. వ్యాధిని నిర్లక్ష్యం చేయకుండా తొలి లక్షణాలు కనిపించిన వెంటనే న్యూరాలజిస్టును సంప్రదించడం అత్యంత ముఖ్యమని సూచించారు. స్వయంగా మందులు వాడటం, ప్రచారంలో ఉన్న అపోహలను నమ్మి శాస్త్రీయ ఆధారాలు లేని చికిత్సల వైపు వెళ్లడం వల్ల పరిస్థితి మరింత విషమించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సరైన సమయంలో నిర్ధారణ జరిగి, నిపుణుల పర్యవేక్షణలో చికిత్స పొందితే పార్కిన్సన్స్ బాధితులు కూడా సాధారణ వ్యక్తుల మాదిరిగానే సుదీర్ఘకాలం నాణ్యమైన జీవితం గడపగలరని స్పష్టం చేశారు. పార్కిన్సన్స్ వ్యాధిపై సమాజంలో ఇంకా అనేక అపోహలు ఉన్నాయని, ఇది వృద్ధులకు మాత్రమే వచ్చే సమస్య కాదని, యువతలోనూ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచించారు. కుటుంబ సభ్యులు కూడా రోగులకు మానసిక ధైర్యం కల్పిస్తూ, చికిత్సలో సహకరించడం అత్యంత అవసరమన్నారు. కార్యక్రమంలో యశోద ఆసుపత్రి కోస్టల్ ఆంధ్రా మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ వి. సాయి కిరణ్ పాల్గొన్నారు. పార్కిన్సన్స్‌పై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, ఆధునిక చికిత్సా విధానాలను చేరువ చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

# జగనన్న 2.0 యాప్‌ను ఆవిష్కరించిన మాజీ మంత్రి విశ్వరూప్



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** వైఎస్సార్‌సీపీ ప్రతిష్టాత్మకంగా రూపొందించిన 'జగనన్న 2.0' యాప్ క్యూఆర్ కోడ్‌ను మాజీ మంత్రి, అమలాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి పినిపే విశ్వరూప్, అమలాపురం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయేల్, ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్, రాజోలు కో-ఆర్డినేటర్ పాముల రాజేశ్వరి, గన్నవరం కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పినిపే శ్రీకాంత్ మాట్లాడుతూ, కార్యకర్తలు, ప్రజలు తమ సమస్యలను 'జగనన్న 2.0' యాప్ ద్వారా నేరుగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లవచ్చని తెలిపారు. ప్రతి కార్యకర్త డిజిటల్‌గా బలోపేతం కావాలనే లక్ష్యంతో ఈ యాప్‌ను రూపొందించారని, నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరూ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ నియోజకవర్గాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

### మహిళా సాధికారతకు

# దుర్గాబాయి దేశ్‌ముఖ్ సేవలు చిరస్మరణీయం

## ఎమ్మెల్సీ కర్రీ పద్మశ్రీ




**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతీయ మహిళా సాధికారత, విద్య, సామాజిక సంక్షేమ రంగాలలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ అందించిన అపారమైన సేవలు చిరస్మరణీయమని, ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనందరి బాధ్యతని ఎమ్మెల్సీ కర్రీ పద్మశ్రీ పేర్కొన్నారు. కాకినాడ విద్యుత్‌నగర్‌లోని ఐడల్ కాలేజీలో ఆల్ ఇండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత్రి శైలజ శ్యామ్‌కు 'దుర్గాబాయి దేశ్‌ముఖ్ అవార్డు'ను ఎమ్మెల్సీ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కర్రీ పద్మశ్రీ మాట్లాడుతూ గ్రామీణ బాలికల విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం, అట్టడుగు వర్గాలకు చెందిన మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారానే నిజమైన సాధికారత సాధ్యమవుతుందని అన్నారు. మహిళలపై జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా గళం విప్పాలని, చట్టపరమైన మార్గాల ద్వారా తమ హక్కులను సాధించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో AIWC అధ్యక్షురాలు భాను శేషు, అవార్డు గ్రహీత శైలజ శ్యామ్, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి. శ్రీకాంత్, వి.వి. లక్ష్మి, డాక్టర్ మాధవిజయలక్ష్మి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### సర్పవరం జంక్షన్‌లో ట్రావెల్స్ బస్సులకు

# అనుమతి లేదు : ట్రాఫిక్ సీఐ రామారావు

**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ సర్పవరం జంక్షన్ వద్ద ట్రావెల్స్ బస్సులు నిలిపేందుకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని ట్రాఫిక్ టూ సీఐ రామారావు స్పష్టం చేశారు. సర్పవరం జంక్షన్‌లోని పెట్రోల్ బంక్ సమీపంలో ట్రావెల్స్ బస్సులు ఆగుతున్నాయనే అంశంపై స్పందించిన ఆయన, ఆ ప్రాంతాన్ని ట్రావెల్స్ బస్సుల స్టాప్‌గా ఎవరూ పరిగణించవద్దని తెలిపారు. పెట్రోల్ బంక్ వద్ద లేదా సర్పవరం జంక్షన్ పరిసరాల్లో ట్రావెల్స్ బస్సులు ప్రయాణికులను ఎక్కించడం, దింపడం లేదా నిలిపివేయడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. అలాంటి ఉల్లంఘనలు గుర్తిస్తే సంబంధిత వాహనాలపై మోటారు వాహనాల చట్టం ప్రకారం చలానాలు విధించడంతో పాటు అవసరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు, ట్రావెల్స్ నిర్వాహకులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, రద్దీ ప్రాంతాల్లో వాహనాలను నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని ట్రాఫిక్ టూ సీఐ రామారావు విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల భద్రత దృష్ట్యా నిబంధనల అమలులో ఎలాంటి రాజీ ఉండదని ఆయన స్పష్టం చేశారు.

### ప్రజా పంపిణీ వ్యవస్థలో

# పారదర్శకత, జవాబు దారీ తనం తప్పనిసరి

## అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు : జిల్లా జాయింట్ కలెక్టర్ – అపూర్వ భరత్

**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** చౌక ధరల దుకాణాల రేషన్ డీలర్ల ద్వారా లబ్ధిదారులకు సకాలంలో,నిర్ణీత సమయంలో సరుకులు అందేలా నిరంతరం పర్యవేక్షణ ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో పౌరసరఫరాల శాఖ పనితీరు,నిత్యా వసరాల పంపిణీ వ్యవస్థపై శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రత్యేక సమీక్షా సమావేశం జేసి అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా పౌరసరఫరాల అధి కారులు, సివిల్ సప్లైస్ డిప్యూటీ తహశీల్దార్లతో జరిగిన ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థలోని కీలక అంశాలపై పలు స్పష్ట మైన ఆదేశాలు జారీ చేశారు. క్షేత్రస్థాయిలో అధికారులు మరింతబాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. మండల స్థాయి నిత్యావసర సరుకుల నిల్వ కేంద్రాల వద్ద సరుకుల భద్రత, స్టాక్ రిజిస్టర్ల నిర్వహణ పక్కాగా ఉండాలని గోదాములలో సరుకుల రాకపోకలను ఎప్పటిక ప్పుడు నిశితంగా పర్యవేక్షించాలన్నారు. చౌక ధరల దుకాణాల రేషన్ డీలర్ల ద్వారా లబ్ధిదారులకు సకాలంలో,నిర్ణీత సమయం లో సరుకులు అందేలా నిరంతరం పర్యవేక్షణ నిర్వహించాలని ఆదేశించారు. పంపిణీలో పారదర్శకతతో పాటు ఖచ్చితమైన తూకాలు పాటించాలని, ప్రతి లబ్ధిదారుడికి ఖచ్చితమైన బరువుతో రేషన్ సరుకులు అందజేయాలని వివరించారు. తూకం లో ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యత్యాసాలురాకూడదన్నారు..వే-బ్రిడ్జిలు, తూనికలు మరియు కొలతలకు సంబంధించి తలెత్తుతున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.. వే-బ్రిడ్జిలు, ఈ-పాస్ యంత్రాల పనితీరు ను తరచుగా తనిఖీ చేయాలన్నారు పౌర సరఫరాల వ్యవస్థలో ఎక్కడైనా అవకత వకలు, అక్రమాలు జరిగినట్లుతేలితే సంబంధిత బాధ్యుల పై కఠిన చర్యలు తప్పవని జేసి గట్టిగా హెచ్చరించారు. ఈ సమీక్షా కార్యక్రమంలో డీఎస్ఓ లక్ష్మీ ప్రసన్న, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# విభిన్న ప్రతిభావంతులకు చక్కటి అవకాశం : కలెక్టర్

**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలోని దివ్యాంగుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ ఈనెల 18 న ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తు జిల్లాలో దివ్యాంగుల సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో ప్రతి నెలా 3వ శనివారం దివ్యాంగుల సమస్యల పరిష్కార కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈనెల 18 శనివారం కాకినాడ కలెక్టరేట్ ప్రజావాణి హాలులో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 01 గంట వరకు ఈ ప్రత్యేక గ్రీవెన్స్ జరుగుతుందన్నారు. జిల్లా అధికారులు ఈ ప్రత్యేక గ్రీవెన్స్ కు తప్పనిసరిగా హాజరుకావాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. జిల్లాలోని దివ్యాంగులు ఈ ప్రత్యేక ఫిర్యాదుల విభాగం ద్వారా పెన్షన్లు, సహాయ పరికరాలు మంజూరు, విద్య, ఉపాధి, ఆరోగ్య సేవలు, సంక్షేమ పథకాలు ఇతర శాఖాపరమైన విషయాలకు సంబంధించి తమ వినతిపత్రాలను, దరఖాస్తులను, అర్జీలను నేరుగా సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. కావున కాకినాడ జిల్లాలో గల దివ్యాంగులు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# తాండవపల్లి, ఉప్పుచెరువు గ్రామాల్లో కమ్యూనిటీ హాలు నిర్మించాలి

## సామాజిక శంఖారావం బృందం డిమాండ్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** సామాజిక శంఖారావం బృందం నిర్వహించిన సర్వేలో తాండవపల్లి, ఉప్పుచెరువు, మన్నానగర్ కాలనీల్లో దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని తీవ్రమైన సామాజిక, మౌలిక వసతుల సమస్యలను ప్రజలు బృందం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సర్వే బృందం స్థానిక ప్రజల ఇబ్బందులను ప్రత్యక్షంగా పరిశీలించింది. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ చదువుకున్న యువతకు ఉద్యోగాలు లేక బతుకుదెరువు కోసం పెయింటింగ్, హోటల్ పనులకు, ఆక్వా చెరువుల వద్ద కూలి పనులకు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆపద సమయాల్లో అధిక వడ్డీలకు అప్పులు చేస్తూ ఇక్కట్ల పాలవుతున్నామని, ఉప్పుచెరువు గ్రామంలో ప్రైవేట్ బ్యాంకులకు వడ్డీలు కట్టలేదనే కారణంతో రెండు కుటుంబాల ఇళ్లను స్వాధీనం చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి రుణమాఫీ ద్వారా ఆ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. డ్వాక్రా మహిళల వద్ద బ్యాంకులు అధిక వడ్డీలు వసూలు చేయడాన్ని తక్షణమే అరికట్టాలని, వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే స్థానిక స్మశాన వాటికను అభివృద్ధి చేయాలని కోరారు. ఈ ప్రాంతంలో చుట్టూ ఆక్వా చెరువులు ఉండటం వల్ల స్థానిక మహిళలకు పనులు దొరకడం లేదని, తక్షణమే ఉపాధి హామీ పనులు కల్పించి, ఏడాదికి 200 రోజుల పని దినాలతో పాటు రోజువారీ కూలి ?600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో వెంటనే కమ్యూనిటీ హాలు నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ సమస్యలపై స్థానిక అధికారులు, ప్రభుత్వం తక్షణమే స్పందించి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించని యెడల గ్రామస్తులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కారెం వెంకటేశ్వరరావు, ఐద్వా జిల్లా నాయకురాలు అమూల్య, స్థానిక వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పరమాట వరలక్ష్మి, కందికట్ల అమ్మాజీ, జల్లి దమయంతి, మంగం కుమారి, మాకే రాని, మోసిగంట బాలవేణి, పొలమూరు నాగమణి, పొలమూరు వెంకటలక్ష్మి, వేముల బేబీ ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# ముమ్మిడివరం అమ్మాయికి 'షైనింగ్ స్టార్' అవార్డు



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇంటర్మీడియట్ (2025-26) విద్యా సంవత్సరానికి గానూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 'షైనింగ్ స్టార్' అవార్డుకు ముమ్మిడివరంకు చెందిన అమలదాసు జ్యోతిక ఎంపికైంది. శ్రీకృష్ణదేవరాయ మహిళా కళాశాల విద్యార్థిని అయిన జ్యోతిక.. రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన 30 మందిలో ఒకరిగా నిలిచినట్లు అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రిన్సిపల్, డీఐఈఓ తెలిపారు. ఈ నెల 20న అమలాపురంలో కలెక్టర్ చేతుల మీదుగా ఆమె ఈ అవార్డు అందుకోనుంది.



# నల్లమిల్లి కుటుంబానికే అనపర్తి తేదేపా పగ్గాలు

## మూడు తరాలుగా కొనసాగుతున్న విశ్వాసానికి మరో ముద్ర - అనపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జిగా మనోజ్ రెడ్డి



**అనపర్తి, విశ్వంవాయిస్ న్యూస్ :** అనపర్తి నియోజకవర్గంలో నల్లమిల్లి కుటుంబంపై తెలుగుదేశం పార్టీ చూపుతున్న విశ్వాసం మరోసారి స్పష్టమైంది. పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు మూడు తరాలుగా కొనసాగుతున్న రాజకీయ అనుబంధానికి కొనసాగింపుగా నల్లమిల్లి మనోజ్ రెడ్డిని అనపర్తి తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జిగా అధిష్ఠానం నియమించింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నియామక ఉత్తర్వులు జారీ చేయడంతో అనపర్తి రాజకీయాల్లో ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు పార్టీని స్థాపించిన సమయంలో ఆయనతో కలిసి పనిచేసిన ప్రముఖ నాయకుల్లో స్వర్గీయ నల్లమిల్లి మూలారెడ్డి ఒకరు. పార్టీ బలోపేతంలో కీలక పాత్ర పోషించిన ఆయన అనంతరం అనపర్తి ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలందించారు. ప్రజలతో మమేకమైన నాయకుడిగా ఆయన సంపాదించిన పేరు నేటికీ నియోజకవర్గ రాజకీయాల్లో ప్రత్యేకంగా నిలిచింది. మూలారెడ్డి రాజకీయ వారసత్వాన్ని ఆయన కుమారుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కొనసాగించారు. తెలుగుదేశం పార్టీ తరఫున ప్రజలకు సేవలందించిన ఆయన, అనంతరం రాజకీయ సమీకరణాల నేపథ్యంలో కూటమి అభ్యర్థిగా భారతీయ జనతా పార్టీ తరఫున పోటీ చేసి విజయం సాధించారు. అయినప్పటికీ నల్లమిల్లి కుటుంబంపై తెలుగుదేశం పార్టీ నాయకత్వం చూపిన విశ్వాసం ఏమాత్రం తగ్గలేదని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పుడు అదే కుటుంబానికి చెందిన మూడో తరం నాయకుడు, రామకృష్ణారెడ్డి తనయుడు, స్వర్గీయ మూలారెడ్డి మనుమడు నల్లమిల్లి మనోజ్ రెడ్డికి అనపర్తి టీడీపీ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడం ద్వారా పార్టీ తన అనుబంధాన్ని మరోసారి చాటిచెప్పింది. యువ నాయకుడిగా గుర్తింపు పొందుతున్న మనోజ్ రెడ్డి సేవాభావం, ప్రజలతో మమేకమయ్యే తీరు, యువతను ఆకర్షించే నాయకత్వ లక్షణాలు పార్టీకి కొత్త ఉత్సాహాన్ని తీసుకొస్తాయని టీడీపీ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. తాత ప్రజాసేవా స్ఫూర్తి, తండ్రి రాజకీయ అనుభవం కలగలిసి మనోజ్ రెడ్డి నాయకత్వంలో అనపర్తి నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతం కావడంతో పాటు అభివృద్ధికి కొత్త దిశ లభిస్తుందని నాయకులు, కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. అనపర్తి రాజకీయాల్లో మూడు తరాలుగా నల్లమిల్లి కుటుంబంతో కొనసాగుతున్న టీడీపీ అనుబంధానికి తాజా నియామకం మరో నిదర్శనంగా నిలిచిందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

# నాయకులు, కార్యకర్తల సమన్వయమే పార్టీకి బలం : బొడ్డు



## ప్రజల నుంచి అర్జీలు స్వీకరణ

**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** పార్టీలో నాయకులు కార్యకర్తలు సమన్వయంగా ఉంటేనే పార్టీకి బలంగా ఉంటుందని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాజమహేంద్రవరం రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. శుక్రవారం ఆయన బూరుగుపూడి గేట్ వద్ద ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 'స్పందన' కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వచ్చిన సమస్యలను వినతుల రూపంలో స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం క్యాడర్ సమావేశంలో మాట్లాడుతూ రాజానగరం నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసిమెలిసి పనిచేస్తూ పార్టీని మరింత బలపరచాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యను ప్రాధాన్యతగా తీసుకుని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటానన్నారు. పార్టీ నాయకులందరూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో చూడాలని, ఇంకా అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే తనకు తెలియజేయాలన్నారు. త్వరలో రానున్న ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని నాయకులంతా సమన్వయంతో పని చేస్తూ, ప్రజల సమస్యల పరిష్కారానికి అందరం కలిసి చిత్తశుద్ధితో పనిచేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కంటే నాగ కేశవరావు, గంగిశెట్టి చంటిబాబు, దూది కాంతారావు,మార్ని రాము,కొయ్యే సామ్యూల్, బుద్ధ బాపూజీ, నియోజకవర్గ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# టిడ్కో గృహాలపై ఎమ్మెల్యే వేగుళ్ళ సమీక్ష



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట టిడ్కో గృహాల్లో వాటర్ లీకేజీలు, పెండింగ్ రిపేర్లపై రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మండపేట పురపాలక కార్యాలయంలో ఈ సమీక్ష నిర్వహించారు.ఈ సమావేశంలో కమీషనర్ టి.వి. రంగారావు టిడ్కో అధికారులు పురపాలక సంఘ సెక్షన్ హెడ్స్ పాల్గొన్నారు.టిడ్కో గృహాలకు సంబంధించి ఇప్పటివరకు ఎన్ని బ్లాకుల్లో వాటర్ లీకేజ్ రిపేర్లు పూర్తయ్యాయో వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిపేర్లు ఇంకా పూర్తికాని బ్లాకుల వివరాలను వెంటనే అందజేయాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ రిపేర్లను టిడ్కో ఉన్నతాధికారులతో చర్చించి త్వరగా పూర్తి చేయిస్తామని తెలిపారు.అదే సమయంలో ఫేజ్-1, ఫేజ్-2 కింద హ్యాండ్ ఓవర్ చేసిన గృహాల్లో ప్రస్తుతం ఎంతమంది లబ్ధిదారులు నివాసం ఉంటున్నారనే విషయంపై కూడా ఆరా తీశారు. హ్యాండ్ ఓవర్ అయినా ఇంకా గృహాల్లోకి రాని లబ్దిదారులను గుర్తించి, వారిపై తదుపరి చర్యలు తీసుకుంటామని కమీషనర్ సమావేశంలో వివరించారు. టిడ్కో లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.

# వాయిద్య కళాకారుల సంఘం ఎంపిక



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముమ్మిడివరం అయ్యప్ప స్వామి ఆలయం వద్ద వాయిద్య కళాకారుల సంఘం ఎంపిక జరిగింది. నూతన అధ్యక్షుడిగా శీలం వెంకటేశ్వర్రావు, ఉపాధ్యక్షుడిగా యనమదల శ్రీనివాసరావు, కార్యదర్శిగా పాలకొల్లు వీరబ్రహ్మం, సహాయకార్య దర్శిగా శ్రీనివాసరావు, కోశాధికారులుగా దుగుదుర్తి రాంబాబు, అప్పారావు, కార్యవర్గ సభ్యులుగా ఎంపికయ్యారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

# కోతలతో సంక్షేమం... కొందరికే పరిమితమైన తల్లికి వందనం



## వైసిపి నియోజకవర్గ ఆర్టీఐ విభాగ అధ్యక్షుడు మందపల్లి రవి

**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం అర్హులైన ప్రతి తల్లికి అందజేయాలని వైసిపి నియోజకవర్గ ఆర్టీఐ విభాగ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ కోరారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ యూడైస్ (యూడీఐఎస్ఈ) గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 87.41 లక్షల మంది విద్యార్థులు ఉన్నప్పటికీ, తల్లికి వందనం పథకం కింద కేవలం 64.76 లక్షల మందికి మాత్రమే లబ్ధి చేకూరిందన్నారు. దీంతో 22.65 లక్షల మంది అర్హులైన విద్యార్థులు, వారి తల్లులు పథకానికి దూరమయ్యారని ఆరోపించారు. పథకం ప్రారంభించిన తొలి ఏడాదిలోనే ప్రభుత్వం పూర్తి స్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని, రెండో ఏడాదిలో కూడా సుమారు 21 లక్షల మంది తల్లులకు లబ్ధి కల్పించకుండా మొండిచేయి చూపిందని విమర్శించారు. ఈ పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలంటే సంవత్సరానికి రూ.13,112.82 కోట్ల నిధులు అవసరమని, అయితే ఈ ఏడాది ప్రభుత్వం కేవలం రూ.10,120.78 కోట్లకే పరిమితమైందన్నారు. గత ఏడాది కూడా రూ.6,377 కోట్లను మాత్రమే విడుదల చేసి పథకాన్ని అరకొరగా అమలు చేసిందని ఆరోపించారు. ఈ విధంగా ప్రభుత్వం తల్లులకు ఇవ్వాల్సిన సాయంలో మూడేళ్ల కాలంలో మొత్తం రూ.22,840.68 కోట్ల బకాయి పడిందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి తల్లికి ఎలాంటి వివక్ష లేకుండా తల్లికి వందనం పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసి, బకాయి నిధులను వెంటనే విడుదల చేయాలని రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఘనంగా ప్రపంచ లా దినోత్సవం




**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ లా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. న్యాయస్థానాల ఆవరణలో ఉన్న న్యాయదేవత విగ్రహానికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటిపల్లి లోవరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాట్లాడుతూ భారతదేశ న్యాయవ్యవస్థ ప్రపంచ దేశాల్లోనే అత్యధిక ప్రాముఖ్యతను సంతరించుకుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా న్యాయవాదులందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నీలం మధుసూదన్ రావు, ఉపాధ్యక్షుడు తారకేశ్వరరావు, సాదే నారాయణ, సీనియర్ న్యాయవాదులు వాడ్రేవు సాయిప్రసాద్, డి.పి.శాస్త్రి, పిల్లి మురళి, దొమ్మలపాటి సత్యనారాయణ, బులుసు వెంకటేశ్వరరావు, పృథ్వి, చక్రవర్తి, జానకి, దుర్గాదేవి, భవాని తదితర సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణులు బ్రహ్మయజ్ఞం (స్మార్త) పరీక్షలు

# విజయవంతం చేయండి



## జిల్లా అధ్యక్షులు సీతారామశాస్త్రి

**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** పురోహిత బ్రాహ్మణులు రానున్న ఆగస్టు మాసంలో మూడు,నాలుగు తేదీల్లో జరిగే బ్రహ్మయజ్ఞం పరీక్షలను విజయవంతం చేయాలని తూర్పుగోదావరి జిల్లా పురోహిత బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షులు మర్ల సీతారామశాస్త్రి తెలిపారు. శుక్రవారం ఆయన విశ్వం వాయస్ విలేకరితో మాట్లాడుతూ రానున్న ఆగస్టు మూడు,నాలుగు తేదీల్లో తూర్పుగోదావరి జిల్లా విభాగం మండపేట మండలం ద్వారపూడి గ్రామంలో రెండు రోజులపాటు పురోహిత బ్రాహ్మణ సమైక్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్రహ్మయజ్ఞం(స్మార్త పరీక్షలు)పరీక్షలను విజయవంతం చేయాలన్నారు.రెండు ఉభయ తెలుగు రాష్ట్రాల పురోహిత బ్రాహ్మణులు విచ్చేసి, పరీక్షల్లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

# సామాజిక సమానత్వానికి ప్రతీక ముద్రగడ

## వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల సుధాకర్



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం సామాజిక సమానత్వానికి ప్రతీకగా నిలిచిన గొప్ప నాయకుడని వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల సుధాకర్ కొనియాడారు. ముద్రగడ పద్మనాభం మరణం పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ జీవిత ప్రారంభం నుంచే సామాజిక న్యాయానికి కట్టుబడి దానిని ఆచరణలో చూపిన అరుదైన నాయకుడు ముద్రగడ అని అన్నారు. తన ఇంటికి వచ్చిన బడుగు, బలహీన వర్గాల ప్రజలను ఇతర వర్గాలతో సమానంగా ఆదరించి ఆప్యాయంగా చూసే గొప్ప మనస్తత్వం ఆయనదని పేర్కొన్నారు. 1989, 94 మధ్యకాలంలో ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఓపెన్ కేటగిరీలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని మండల అధ్యక్షుడిగా నియమించి సామాజిక న్యాయానికి నిదర్శనంగా నిలిచిన ఘనత ముద్రగడకే దక్కుతుందని తెలిపారు. అలాగే కిర్లంపూడి గ్రామ నడిబొడ్డున డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించి, అంబేద్కర్ భావజాలంపై తనకున్న నిబద్ధతను చాటారని అన్నారు. కాపు సామాజిక వర్గ ఆత్మగౌరవానికి భంగం కలిగిన ప్రతిసారి ఆయన ధైర్యంగా ముందుండి పోరాడారని, అదే సమయంలో అధికారంలో ఉన్నప్పుడు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేశారని సుధాకర్ గుర్తు చేశారు. సామాజిక సమానత్వం, న్యాయం కోసం నిరంతరం కృషి చేసిన ముద్రగడ మరణం రాష్ట్రానికి, సామాజిక ఉద్యమాలకు తీరని లోటని పేర్కొన్నారు.

# వైసీపీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులుగా తోరాటి



## లీగల్ విభాగం అధ్యక్షులుగా చెరుకూరి



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలం వైఎస్ఆర్సిపి గ్రీవెన్స్ విభాగం అధ్యక్షుడిగా తోరాటి సత్య ప్రసాద్, ఉపాధ్యక్షులుగా వలివేటి పోసి, ప్రధాన కార్యదర్శిలుగా రెడ్డి దావీద్ చార్లెస్, చిలకం ఆంజనేయులు, మసిముక్కల నాగేశ్వరరావు,పసుపులేటి వెంకటేశ్వరరావులను నియమించినట్లు వైఎస్ఆర్సిపి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు, రాజానగరం మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజా తెలిపారు. అదేవిధంగా మండల లీగల్ విభాగం అధ్యక్షులుగా చెరుకూరి వీర వెంకట చౌదరి, ఉపాధ్యక్షులుగా మల్లిమొగ్గల చిన్నబాబు, ప్రధాన కార్యదర్శిగా మారిశెట్టి వీరేంద్రలను నియమించినట్లు రాజా తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నూతన కమిటీసభ్యులకు అభినందనలు తెలిపారు. నూతన కమిటీసభ్యులు జక్కంపూడి కుటుంబానికి, వైఎస్ఆర్సిపి నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## బాల్య వివాహాలు పోక్సో చట్టం,

# మహిళా చట్టాలపై అవగాహన




## సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి

**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** మహిళలు ఫోక్సో, బాల్య వివాహాల నిర్మూలన మహిళారక్షణ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి,సీనియర్ సివిల్ జడ్జి యార్లగడ్డ శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం కోరుకొండ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోక్సో, బాల్య వివాహాల నిర్మూలన,మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని నల్సా వారి "పిల్లలకు స్నేహపూర్వక చట్టపరమైన సేవలు" పథకం-2024, బాల్య వివాహాల నివారణ, పోక్సో చట్టం-2012, ఉచిత న్యాయ సహాయం, మధ్యవర్తిత్వం, మహిళా చట్టాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల పిల్లల విద్య,ఆరోగ్యం,భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయన్నారు. పిల్లల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొందరు వారిపై అఘాయిత్యాలకు పాల్పడుతూ, అక్రమ కార్యకలాపాల్లోకి దారి మళ్లిస్తున్నార న్నారు. బాల్య వివాహ నిషేధ చట్టం--2006, బాలకార్మిక నిర్మూలన చట్టం--1986 వంటి చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.అలాగే, నల్సా వారి "పిల్లలకు స్నేహపూర్వక చట్టపరమైన సేవలు" పథకం-2024 ద్వారా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పిల్లలకు అందిస్తున్న ఉచిత న్యాయ సేవలను వివరించారు. న్యాయ సలహాలు, సూచనల కోసం టోల్ ఫ్రీ నంబర్ 15100ను సంప్రదించాలని సూచించారు. మహిళలు న్యాయపరమైన సమస్యలు ఎదురైనప్పుడు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను నిర్భయంగా సంప్రదించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ శాఖ,మహిళా,శిశు సంక్షేమ శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శి, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్స్, పారా లీగల్ వాలంటీర్లు (గ్రాఎం), మహిళలు పాల్గొన్నారు.

## షైనింగ్ స్టార్ అవార్డుకు మోడరన్ హైస్కూల్


# విద్యార్థిని ప్రశంస ఎంపిక



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం మోడరన్ హైస్కూల్ పదో తరగతి విద్యార్థిని నున్నబోయిన ప్రశంస 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ప్రతిష్టాత్మక షైనింగ్ స్టార్స్-2026 ప్రతిభా పురస్కారానికి ఎంపికైంది. ఈ విషయాన్ని మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జి.వి. రావు శుక్రవారం విలేకరులకు తెలిపారు. గత నెలలో అమరావతిలో మోడరన్ కాలేజీ ఇంటర్మీడియట్ ర్యాంకర్లను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా అభినందించిన సమయంలో, పదో తరగతి టాపర్‌గా ప్రశంస కూడా ముఖ్యమంత్రి అభినందనలు అందుకున్న విషయాన్ని గుర్తుచేశారు. ఈ నెల 20వ తేదీన అమలాపురంలో జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ చేతుల మీదుగా ప్రశంస ఈ అవార్డును అందుకోనున్నట్లు అకాడమిక్ డైరెక్టర్ ఆర్. ఉమాదేవి వివరించారు. షైనింగ్ స్టార్ అవార్డు దక్కించుకున్న ప్రశంసను అకాడమిక్ డైరెక్టర్లు కె.సాయిరాం చౌదరి, ఎ.రమా దేవి, ఇంటర్మీడియట్ ప్రిన్సిపాల్ సి.హెచ్. రాజేష్ మరియు మోడరన్ విద్యాసంస్థల సిబ్బంది అభినందించారు.

## ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై

# రైతులు దృష్టి సారించాలి



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలంలోని రైతులు ప్రస్తుత వాతావరణ పరిస్థితులు మరియు ఎల్ నినో ప్రభావం దృష్ట్యా వరి సాగుపై పూర్తిగా ఆధారపడకుండా, నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకుని ప్రత్యామ్నాయ పంటల సాగును పరిశీలించాలని మండల వ్యవసాయాధికారి ఎ.గౌరీదేవి సూచించారు. వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో నీటి వినియోగం తక్కువగా ఉండే జొన్న, సజ్జ, రాగులు, పెసర, మినుము, కంది, నువ్వులు వంటి పంటలను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సాగు చేయడం ద్వారా రైతులు నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు.రైతులు తమ పొలాల పరిస్థితులు, నీటి వనరుల లభ్యత, నేల స్వభావాన్ని దృష్టిలో ఉంచుకొని సమీప రైతు సేవా కేంద్రం (ఆర్ ఎస్ కె) లేదా మండల వ్యవసాయ కార్యాలయాన్ని సంప్రదించి తగిన పంటలను ఎంపిక చేసుకోవాలనిసూచించారు. వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తూ శాస్త్రీయ సాగు పద్ధతులను అవలంబించడం ద్వారా దిగుబడి మరియు ఆదాయాన్ని మెరుగు పరచు కోవచ్చని మండల వ్యవ సాయాధికారి తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికలో

# వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే వేగుళ్ళ



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. టీడీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను ఎమ్మెల్యేకు అందజేశారు. ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీరాజ్, రహదారులు, డ్రైనేజీలు, విద్యుత్, వ్యవసాయం, మత్స్యశాఖ, విద్యాశాఖ, టిడ్కో ఇళ్లు, ముఖ్యమంత్రి సహాయనిధి తదితర అంశాలపై మొత్తం 45 వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని సంబంధిత అధికారులతో పరిశీలించి, అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని ఆయన సూచించారు.



# దీపికా నిబద్ధతకు హ్యాట్సాఫ్..!

## ఏడు మాసాల గర్భంతోనే..




ఏడు నెలల గర్భిణిగా ఉన్నప్పటికీ దీపికా పదుకొణె తన అంకితభావాన్ని చాటుకుంటున్నారు. అట్లీ దర్శకత్వంలోని తెరకెక్కుతున్న 'రాకా' సినిమా కోసం యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణను దీపిక పూర్తిచేసినట్లు సమాచారం. మెటర్నిటీ బ్రేక్‌కు ముందే సినిమా షూటింగ్ పూర్తి చేసేందుకు.. రాత్రిపూట కూడా సినిమా షూటింగ్‌లలో దీపిక పాల్గొంటున్నారట. వృత్తిపట్ల ఆమె చూపుతున్న నిబద్ధత పట్ల అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె మరోసారి తన వృత్తిపట్ల ఉన్న అంకితభావాన్ని చాటుకుంటోంది. దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'రాకా'లో అల్లు అర్జున్ హీరోగా నటిస్తుండగా, దీపికా పదుకొణె ప్రధాన పాత్రలో కనిపించనుంది. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. త్వరలో రెండో బిడ్డకు జన్మనివ్వబోతున్న దీపికా ఏడు నెలల గర్భిణిగా ఉన్నప్పటికీ.. 'రాకా' షూటింగ్‌లో పాల్గొంటున్నారు. మరీ ముఖ్యంగా ఈ సినిమాలో కఠినమైన యాక్షన్ సన్నివేశాలను దీపిక ప్రెగ్నెన్సీతోనే పూర్తి చేసినట్లు తెలుస్తోంది. దీపికా తన మెటర్నిటీ బ్రేక్‌కు ముందే వీలైనంత వరకు షూటింగ్ పూర్తి చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా రాత్రిపూట కూడా షూటింగ్‌లు, శారీరకంగా కాస్త కఠినమైన యాక్షన్ సన్నివేశాలను కూడా చేశారట. అయితే ఆమె ప్రెగ్నెన్సీని దృష్టిలో పెట్టుకుని.. యాక్షన్ సన్నివేశాల షూటింగ్ సమయంలో అన్ని ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

ప్రమాదకరమైన స్టంట్ల కోసం అవసరమైతే బాడీ డబుల్‌ను కూడా ఉపయోగించినట్లు బాలీవుడ్ మీడియా వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. దీంతో 'రాకా' సినిమా షూటింగ్‌తో పాటు తల్లి, బిడ్డ ఆరోగ్యానికి కూడా సమాన ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో సినిమా ఇండస్ట్రీలో ఎనిమిది గంటల పని నిబంధనకు సపోర్ట్‌గా దీపిక చేసిన కామెంట్స్ చర్చనీయాంశంగా మారింది. అయితే ఇప్పుడు ఈ నిబంధనను పట్టించుకోకుండా ప్రెగ్నెన్సీలోనూ రాత్రిపూట కూడా షూటింగ్‌లో పాల్గొనడం విశేషం. గర్భధారణ సమయంలోనూ తన వృత్తిపట్ల దీపికా చూపుతున్న నిబద్ధతపై అభిమానులు, నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. మరోవైపు, 'రాకా' చిత్రంపై ఫ్యాన్స్‌లో ఆసక్తి కూడా మరింత పెరుగుతోంది. ఈ సినిమాలో అల్లు అర్జున్-దీపికా జోడీని తొలిసారి పెద్ద తెరపై చూడబోతుండటంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

### జీసస్ క్రైస్ట్ బయోపిక్..

# పవన్ కల్యాణ్- సింగీతంల 'ప్రిన్స్ ఆఫ్ పీస్'

## ఎందుకు ఆగిపోయిందో తెలుసా?






పవర్ స్టార్ పవన్ కల్యాణ్- లెజెండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు కాంబినేషన్ లో 'ప్రిన్స్ ఆఫ్ పీస్' అట్టహాసంగా ప్రారంభమైంది. జీసస్ క్రైస్ట్ బయోపిక్ గా తెరకెక్కాల్సిన ఈ మూవీ కోసం బెత్లహేం, జెరూసలేం వంటి ప్రదేశాలలో లోకేషన్ల వేట కూడా నిర్వహించారు. కానీ ఏమైందో తెలియదు కానీ ఈ క్రేజీ ప్రాజెక్టు ఆగిపోయింది. పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ కెరీర్‌లో ఎన్నో బ్లాక్ బస్టర్స్, ఇండస్ట్రీ హిట్స్ ఉన్నాయి. అయితే ఆయన కెరీర్‌లో కూడా కొన్ని సినిమాలు అట్టహాసంగా ప్రారంభమై మధ్యలోనే ఆగిపోయాయి. సత్యగ్రహి, కోబలి, ప్రిన్స్ ఆఫ్ పీస్ వంటి సినిమాలు అనౌన్స్మెంట్ దశలోనే ఆగిపోయి అభిమానులకు నిరాశను మిగిలిపోయాయి. వీటిలో ప్రధానంగా చెప్పుకోవాల్సింది 'ప్రిన్స్ ఆఫ్ పీస్' సినిమా గురించి. జీసస్ క్రైస్ట్ జీవిత కథ ఆధారంగా లెజెండరీ డైరెక్టర్ సింగీత శ్రీనివాసరావు దర్శకత్వంలో ఈ సినిమాను తెరకెక్కించాలనుకున్నారు. యేసుక్రీస్తు జీవితం, ఆయన చేసిన గొప్ప పనులు, సమాజానికి అందించిన సందేశాలను నేటి తరానికి చెప్పాలని ఒక మంచి కథను సిద్ధం చేశారు. ఇందుకోసం ప్రముఖ రచయిత జె.కె. భారవి సహాయం కూడా తీసుకున్నారు సింగీతం. ఇందులో పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ను కథానాయకుడిగా తీసుకున్నారు. అయితే ఆయనది జీసస్ పాత్ర కాదని, కానీ కథను మలుపు తిప్పే ఒక పవర్ ఫుల్ రోల్ అని అని దర్శకుడు సింగీతం చెప్పుకొచ్చారు. అలాగే అనుష్కను హీరోయిన్ గా ఎంపిక చేశారు. 2010 లో 'ప్రిన్స్ ఆఫ్ పీస్' పేరుతో ఈ ఈ సినిమాను అధికారికంగా ప్రకటించారు. ప్రముఖ నిర్మాత కొండా కృష్ణంరాజు ఈ సినిమాను నిర్మించేందుకు ముందుకొచ్చారు. 'ప్రిన్స్ ఆఫ్ పీస్' సినిమాను కేవలం తెలుగులోనే కాకుండా హిందీ, తమిళం, మలయాళం వంటి భాషలతో పాటు ఇంగ్లిష్ లోనూ ఒక ఇంటర్నేషనల్ ప్రాజెక్టుగా రూపొందించాలని మేకర్స్ ప్లాన్ చేశారు. ఇందుకో సం పవన్ కళ్యాణ్, సింగీతం, నిర్మాత కొండా కృష్ణంరాజులతో కూడిన చిత్ర బృందం ఇజ్రాయెల్, జెరూసలేం, జోర్డాన్, బెత్లహేం వంటి చారిత్రక ప్రదేశాలను సందర్శించారు. జీసస్ క్రైస్ట్ గురించి ఆసక్తికర విషయాలతో పాటు లొకేషన్ల కోసం వేట కూడా నిర్వహించారు. యేసు క్రీస్తు నడయాడిన ఆయా ప్రాంతాలను ప్రత్యక్షంగా చూసి, సినిమాను అత్యంత సహజంగా ఒక విజువల్ వండర్‌గా మార్చాలని భావించారు. ఇక ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తయి పోయి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమవుతుందనున్న తరుణంలో ఈ క్రేజీ ప్రాజెక్టుకు అనూహ్యంగా బ్రేకులు పడ్డాయి. సెట్స్ పైకి వెళ్లకుండానే అర్ధాంతంగా ఈ సినిమా ఆగిపోయింది. దీనికి ప్రధాన కారణం బడ్జెట్. మొదట ఈ సినిమాకు అనుకున్న బడ్జెట్ కంటే ఇంటర్నేషనల్ లొకేషన్లు, విజువల్స్, రెమ్యునరేషన్ల కోసం అంచనా వేసిన నిర్మాణ వ్యయం భారీగా పెరిగిపోయింది. అంత బడ్జెట్ ను భరించలేమని దర్శక నిర్మాతలు వెనక్కు తగ్గారు. పైగా స్క్రిప్ట్ వర్క్ కోసం రెండేళ్లకు పైగా సమయం పట్టడంతో పవన్ కల్యాణ్ కూడా వేరే ప్రాజెక్టులతో బిజీ అయిపోయారు. అలా మొత్తానికి భారీ బడ్జెట్‌తో అత్యంత భారీగా ప్లాన్ చేసిన జీసస్ క్రైస్ట్ బయోపిక్ సెట్స్‌పైకి వెళ్లకుండానే ఆగిపోయింది.


క్రీడా వాయిస్ — మీ క్రీడా వార్తల స్వరము

## వెస్టిండీస్ క్రికెట్ దిగ్గజం గ్యారీ సోబర్స్ కన్నుమూత



వెస్టిండీస్ క్రికెట్ దిగ్గజం గ్యారీ సోబర్స్ (89) కన్నుమూశారు. అనారోగ్యం కారణంగా ప్రాణాలు కోల్పోయినట్లు ఆయన తనయుడు డేనియల్ వెల్లడించారు. సోబర్స్ 1954 నుంచి 1974 వరకు 93 టెస్టుల్లో 8,032 పరుగులు చేశారు. అత్యధికంగా 365 పరుగులు చేయగా.. మొత్తం 26 సెంచరీలు సాధించారు. 235 వికెట్లు తీశారు. 1968లో ఫస్ట్‌క్లాస్ క్రికెట్లో ఒకే ఓవర్లో 6 సిక్సర్లు బాది, ఆ రికార్డు నెలకొల్పిన తొలి ఆటగాడిగా నిలిచారు. క్రికెట్‌కు ఆయన చేసిన సేవలకు గానూ.. 1975లో బ్రిటన్ రాణి క్వీన్ ఎలిజబెత్ 2 చేతుల మీదుగా 'నైట్' బిరుదును అందుకున్నారు.

## అర్జెంటీనా.. అందులోనూ మెస్సి ఉంటే.. మోహన్‌లాల్ అక్కడే



భారత్‌లో ఫుట్‌బాల్‌ను అభిమానించేవారిలో కోల్‌కతా, కేరళ వారే ఎక్కువగా ఉంటారు. మరీ ముఖ్యంగా అర్జెంటీనా అంటే కేరళవాసులకు బాగా ఇష్టం. డిగో మారడోనా నుంచి ఇప్పుడు లియోనెల్ మెస్సికి వీరాభిమానులు ఉన్నారు. ఆ జాబితాలో మలయాళం సూపర్ స్టార్ మోహన్‌లాల్ కూడా ఒకరు. మెస్సి అంటే ఎంతో ఇష్టమని పలు సందర్భాల్లో మోహన్ లాల్ మనసులో మాట వెల్లడించారు. తాజాగా మెస్సి సారథ్యంలోని అర్జెంటీనా ఫిఫా ప్రపంచ కప్‌లో దుమ్మురేపుతోంది. సెమీస్‌లో బలమైన ఇంగ్లాండ్‌ను ఓడించి ఫైనల్‌కు చేరుకుంది. అట్లాంటాలో జరిగిన ఆ మ్యాచ్‌ను మోహన్ లాల్ ప్రత్యక్షంగా వీక్షించారు. ఆ ఫొటోలను సంగీత దర్శకుడు స్టీఫెన్ దేవస్సీ తన ఇన్‌స్టాలో పోస్టు చేశారు. మోహన్‌లాల్ వెంట నటుడు ఫహాద్ ఫాజిల్ కూడా ఉన్నాడు. ఇక అర్జెంటీనా - స్పెయిన్ జట్ల మధ్య ఫైనల్‌కు న్యూజెర్సీలోని మైదానం వేదికగా నిలిచింది. జులై 19 అర్ధరాత్రి (భారత కాలమానం ప్రకారం) జరగనున్న ఈ మ్యాచ్‌ను కూడా మోహన్ లాల్ ప్రత్యక్షంగా వీక్షించడం ఖాయం. ఇప్పుడే కాదు.. గతంలోనూ అర్జెంటీనా మ్యాచ్ అంటే చాలు అక్కడికి వెళ్లేవారు.

**ఓసారి ఓడి.. మరోసారి గెలిచి**

బ్రెజిల్ వేదికగా 2014లో ఫిఫా ప్రపంచ కప్ జరిగింది. ఫైనల్‌కు అర్జెంటీనా చేరడంతో మోహన్ లాల్ వెంటనే అక్కడికి వెళ్లిపోయారు. అయితే, తుది పోరులో అర్జెంటీనాకు షాక్ తగిలింది. జర్మనీ విజయం సాధించి కప్పును సొంతం చేసుకుంది. ఇక ఖతార్‌లో జరిగిన 2022 ప్రపంచ కప్‌ను అర్జెంటీనా గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఫైనల్‌లో ఫ్రాన్స్‌ను అర్జెంటీనా ఓడించింది. ఈ మ్యాచ్‌నూ లాలాటన్ (మోహన్‌లాల్) ప్రత్యక్షంగా వీక్షించారు. ఈ సారి ఫలితం ఎలా ఉంటుందో చూడాలి మరి!

# ఫిఫా వరల్డ్ కప్.. ఫైనల్ మ్యాచ్‌కు డొనాల్డ్ ట్రంప్



ఫుట్‌బాల్ ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది అభిమానులు ఎంతగానో వేచి చూస్తున్నారు. స్పెయిన్, అర్జెంటీనా మధ్య న్యూజెర్సీలోని మెట్‌లైఫ్ స్టేడియంలో ఈ ఆదివారం (జులై 19న) జరిగే తుది పోరును వీక్షించేందుకు సిద్ధమవుతున్నారు. అయితే, ఈ మ్యాచ్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హాజరు కానుండటం విశేషం. ఈ విషయాన్ని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ ధ్రువీకరించారు. అధ్యక్షుడు ట్రంప్‌తో కలిసి విజేతలకు ప్రపంచకప్‌ను అందజేసే అవకాశం ఉందని ఫిఫా అధ్యక్షుడు గియానీ ఇన్‌ఫాంటినో ఇటీవల వెల్లడించారు. ఇదిలా ఉంటే, ఇంతకుముందు 1978, 1986, 2022లో ప్రపంచకప్ గెలిచిన అర్జెంటీనా.. మరోసారి కప్పుపై కన్నేసింది. హోరాహోరీగా సాగిన సెమీఫైనల్‌లో ఇంగ్లాండ్‌పై దూకుడుగా ఆడి విజయం సాధించింది. కప్‌ను కైవసం చేసుకునేందుకు అడుగు దూరంలో నిలిచింది. 1930, 1990, 2014లోనూ అర్జెంటీనా రన్నరప్‌గా నిలిచింది. ఇక 1996లో కప్పు గెలిచిన ఇంగ్లాండ్.. ఆ తర్వాత ఎప్పుడూ ఫైనల్‌కు చేరలేదు. ఈసారి సెమీ ఫైనల్‌కు వచ్చినప్పటికీ చివరకు అర్జెంటీనా జట్టు దూకుడును తట్టుకోలేక ఓడిపోయింది. మరోవైపు, సమష్టి కృషితో స్పెయిన్ ఫైనల్‌కు చేరుకుంది. సెమీస్‌లో బలమైన ప్రత్యర్థి ఫ్రాన్స్‌ని ఓడించి అర్జెంటీనాతో టైటిల్ పోరుకు సిద్ధమైంది.

### ఫార్మాట్ మార్పుతో వరల్డ్ కప్‌లో

# ఆడాలనుకునే వారికి నష్టం : డబ్ల్యుసిఎ ఆందోళన



వన్డే ప్రపంచ కప్ 2027 ఫార్మాట్‌ను మారుస్తూ ఐసీసీ తీసుకున్న నిర్ణయంపై వరల్డ్ క్రికెటర్స్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఒక్కసారిగా మార్పులు చేస్తే పారదర్శకత, భాగస్వాముల సంప్రదింపులు, ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ ఎదుగుదలపై కీలక ప్రశ్నలు తలెత్తుతాయని పేర్కొంది. వచ్చే ఏడాది ప్రపంచ కప్‌నకు దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా ఆతిథ్యం ఇవ్వనున్నాయి. అయితే, 14 జట్లు బరిలోకి దిగుతున్నా.. మూడు దశల కొత్త ఫార్మాట్‌ను తీసుకొచ్చింది. తక్కువ ర్యాంకింగ్ కలిగిన మూడు జట్లలో 'సూపర్ సిరీస్' ద్వారా ఒకటి మాత్రమే అర్హత సాధించనుంది. ఆ తర్వాత గ్రూప్ స్టేజ్, సూపర్ 7 రౌండ్, నాకౌట్ స్టేజ్‌కు మ్యాచులు వెళ్తాయి. దీనివల్ల చిన్న జట్లకు అవకాశాలు తగ్గిపోతాయని డబ్ల్యూసీఏ తెలిపింది. 'మెగా టోర్నీలకు నిర్మాణ స్వరూపాన్ని మార్చే హక్కు ఐసీసీకి ఉంది. అదే సమయంలో ఆటపట్ల నిబద్ధత, అర్హత మార్గాలు, ప్లేయర్లకు మెరుగైన అవకాశాలు కల్పించడంపై దృష్టి పెట్టాలి. గణనీయమైన మార్పులు చేయాల్సినప్పుడు సరైన సంప్రదింపులు, పారదర్శకత, స్పష్టమైన వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉంది. వన్డే ప్రపంచ కప్‌లో ఆడాలనేది కెరీర్‌లో చాలా మంది ఆటగాళ్ల ఆకాంక్ష. ఆ ఛాన్స్ కోసం ఎంతో నిబద్ధతతో కష్టపడతారు. ఏళ్ల తరబడి కృషి చేస్తారు. కానీ, ఒక్కసారిగా మార్పులు చేస్తే తీవ్ర పరిణామాలకు దారితీసే ప్రమాదం లేకపోలేదు" అని డబ్ల్యూసీఏ సీఈవో టామ్ మోఫట్ తెలిపారు.

**ఆట విస్తరణకు అవరోధం..**

"కొత్త ఫార్మాట్ క్రికెట్‌ను ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలనే స్ఫూర్తికి విరుద్ధంగా ఉంది. కొన్ని దేశాలకు అర్హత సాధించడమనేది కష్టంగా మారనుంది. ప్రపంచ కప్‌లో ఆడాలనే కోరికకు అడ్డుకట్ట వేయడమే అవుతుంది. దీనివల్ల వర్ధమాన క్రికెట్ మార్కెట్లకు లభించే క్రీడాభివృద్ధి, వాణిజ్యపరమైన ప్రయోజనాలు తగ్గిపోతాయి. ఎక్కువ దేశాలను క్రికెట్‌కు అనుసంధానం చేయడం వల్లే మరింతమంది ప్లేయర్లకు అవకాశాలను అందించగలమని డబ్ల్యూసీఏ నివేదిక చెబుతోంది. ఇదే విషయాన్ని ఐసీసీతో సహా సభ్య దేశాలన్నింటి దృష్టికి తీసుకెళ్తాం" అని మోఫట్ వెల్లడించారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

- భక్తి వాయిస్
- బిజినెస్ వాయిస్
- సినీ వాయిస్
- క్రైం వాయిస్
- హెల్త్ వాయిస్
- కిసాన్ వాయిస్
- తీర్పు వాయిస్
- సక్సెస్ వాయిస్
- వనిత వాయిస్
- కిడ్స్ వాయిస్
- తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com